

ఈసం లోకేష్ (ఫైల్)

విధి నిర్వహణలో విషాదం


- గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి
- కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో ఘటన

7

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
5
ఆదివారం, 22 సెప్టెంబరు 2024



ఎన్నాళ్లో నిరీక్షణ



సీతారామ ప్రాజెక్టు ప్రాంతం

ఆపద వేళ రావేల?

కష్టకాలంలో నీరందించి సాగర్ ఆయకట్టును స్థిరీకరించేందుకు సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా చేపట్టిన కృష్ణా-గోదావరి జలాల అనుసంధానం ప్రక్రియ ఇంకా ఆచరణకు నోచుకోలేదు. ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు అనుసంధానించి సాగర్ ఆయకట్టులో 1.25లక్షల ఎకరాలకు నీరందించేందుకు ఆగస్టు 15న రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా సీతారామ పంప్‌హౌస్‌లను ప్రారంభించింది. కానీ నేటికీ ఏన్కూర్ లింక్ కెనాల్‌కు గోదావరి జలాలు అందలేదు. ఈనెల మొదటివారంలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో సాగర్ ఎడమకాల్వకు అనేక చోట్ల గండ్లు పడి గత 20 రోజులుగా ఆయకట్టుకు నీరందకపోవడంతో వేలఎకరాల్లో వరిపైరు ఎండిపోయే స్థితిలో ఉంది. ఇలాంటి సమయంలో సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు అందిస్తే కనీసం లక్ష ఎకరాల సాగర్ ఆయకట్టుకు నీటి ఎద్దడి లేకుండా ఉండేదని రైతులు చెబుతున్నారు.

కృష్ణమ్మ దరిచేరని గోదావరి

- గత నెలలో అట్టహాసంగా 'సీతారామ' పంప్‌హౌస్‌ల ప్రారంభం
- ఇంకా అసంపూర్తిగానే రాజీవ్ లింక్‌కెనాల్ నిర్మాణం
- కాల్వలకు గండ్లతో సాగర్ ఆయకట్టులో తీవ్ర నీటి ఎద్దడి
- ఎండిపోయే దశలో వేల ఎకరాల్లోని వరి పైరు
- ఆపద సమయంలో అందని గోదావరి జలాలు
- త్వరగా కాల్వ పనులు పూర్తిచేయాలని రైతుల వినతి

వైరా, సెప్టెంబరు 21: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.13వేల కోట్లతో చేపట్టిన సీతారామ ప్రాజెక్టు నిర్మాణం గత పదేళ్లుగా అసంపూర్తిగానే మిగిలిపోయింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీతారామ ద్వారా ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టులో 1.25లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించేందుకు మంత్రి తుమ్మల చొరవతో మార్చి 13న వైరాలో నలుగురు మంత్రులు రాజీవ్ లింక్ కెనాల్‌కు శంకుస్థాపన చేసి వడివడిగా నిర్మాణం చేపట్టారు. సీతారామ మెయిన్ కెనాల్ కిలోమీటర్ 100.225 వద్ద జూలూరుపాడు మండలం వినోభానగర్ నుంచి 8.6 కిలోమీటర్లు(18ఎల్ డిస్ట్రిబ్యూటరీ) వైరా లింకు కెనాల్‌ను నిర్మించి నాగార్జునసాగర్ ఎడమకాల్వ (21ఎం బీసీ) 52.299కిలోమీటరు వద్ద కలిపి సాగర్ ఆయకట్టులో 1.25లక్షల



అసంపూర్తిగా ఉన్న రాజీవ్ కెనాల్ పనులు

ఎకరాలకు గోదావరి జలాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. మార్చి 13న శంకుస్థాపన చేసిన సమయంలో ఆగస్టు 15నాటికి ఈ లింకు కెనాల్ నిర్మాణం పూర్తిచేసి గోదావరి జలాలను కృష్ణాజలాలతో అనుసంధానం చేస్తామని మంత్రులు ప్రకటించారు. కానీ ఆ ప్రకటన ఆచరణకు నోచుకోలేదు.

అట్టహాసంగా పంపుహౌస్‌ల ప్రారంభం..

మంత్రులు ప్రకటించినట్లుగానే ఆగస్టు 15న సీఎం రేవంత్‌రెడ్డి సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌లను అట్టహాసంగా ప్రారంభించారు. ఆ తర్వాత వైరాలో భారీ రైతు సదస్సు నిర్వహించారు. 2026 ఆగస్టు నాటికి సీతారామ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసి పూర్తిస్థాయిలో గోదావరి జలాలు సరఫరా చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అప్పటివరకు ప్రస్తుతం నిర్మించిన రాజీవ్ లింకు కెనాల్ ద్వారా 1.25లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టుకు నీటి ఎద్దడి లేకుండా గోదావరి జలాలు అందిస్తామని స్పష్టం చేశారు. అయితే జూలై చివరి నుంచి వరుసగా (మిగతా 6వ పేజీలో)

లక్ష ఎకరాల ఆయకట్టుకు గడ్డు పరిస్థితి

నిర్ణీత సమయానికి రాజీవ్ లింక్ కెనాల్ పనులు పూర్తయ్యి సీతారామ నుంచి గోదావరి జలాలు విడుదల చేసి ఉంటే ప్రస్తుత సాగర్ ఆయకట్టులోని రైతులు గడ్డు పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చేది కాదు. వైరా రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీరున్నందున దీని ఆయకట్టులోని 25వేలకు మరో నెలరోజుల వరకు సాగునీటి సమస్య లేదు. కానీ మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని సుమారు లక్ష ఎకరాల్లోని సాగర్ ఆయకట్టు మాత్రం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. కాల్వ నిర్మాణం పూర్తి చేసి ఉంటే ఈ ఆపద సమయంలో సీతారామ నుంచి గోదావరి జలాలను సరఫరా చేసే వీలుండేది. అంతేకాకుండా ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో ఇదే సాగర్ ఆయకట్టులో ఉన్న మరికొన్నివేల ఎకరాలకు కూడా గోదావరి జలాలు పారేవి.

సాగర్‌లో పుష్కలంగా సాగునీరు అందుబాటులో ఉండటంతో ఆగస్టు 15 తర్వాత రాజీవ్ లింక్ కెనాల్ నిర్మాణ పనుల్లో కొంత వేగం తగ్గింది. దానికి తోడు భారీ వర్షాలు, వరదలు రావడంతో పనుల్లో మరింత జాప్యం జరిగింది. కానీ ముందుగా ప్రకటించినట్లు ఆగస్టు 15నాటికి రాజీవ్ లింక్ కెనాల్‌ను పూర్తిచేసి గోదావరి జలాలను సాగర్‌కాల్వకు అనుసంధానం చేసి ఉంటే ప్రస్తుతం సాగర్ ఆయకట్టులో వేల ఎకరాల్లో పంటలను కాపాడే అవకాశం ఉండేది. ఇప్పటికైనా అధికారులు రాజీవ్ లింక్ కెనాల్ పనులను త్వరగా పూర్తిచేసి ఆపదలో ఉన్న సాగర్ ఆయకట్టు పంటలకు గోదావరి జలాలను అందించాలని రైతులు కోరుతున్నారు.

మొన్న గండి.. నేడు బుంగ

పాలేరు దిగువన సాగర్ ఎడమ కాల్వకు మళ్లీ విపత్తు

- మల్లాయిగూడెం అండర్ టన్నెల్ వద్ద కూలిన మిడిల్‌వాల్, స్లాబు
- నీటి విడుదలను నిలిపివేసిన అధికారులు
- మరో రెండు రోజులు ఆలస్యం కానున్న నీటి విడుదల
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- 20 రోజులుగా నీరందక ఎండిపోతున్న పంటలు



బుంగ పడిన ప్రాంతం

కూసుమంచి, సెప్టెంబరు 21: పాలేరు రిజర్వాయర్ దిగువన సాగర్ ఎడమ కాలువకు మల్లాయిగూడెం అండర్ టన్నెల్ (యూటీ) వద్ద బుంగపడింది. ఈ నెల 1న వరదల మూలంగా సాగర్ కాలువకు గండ్లు పడిన విషయం విదితమే. వాటిని పూడ్చివేసిన ఐబీ అధికారులు శనివారం సాయంత్రం గేట్లెత్తి వెయ్యి క్యూసెక్కుల నీట్రిని విడుదల చేశారు. అయితే పది నిమిషాల వ్యవధిలోనే మరమ్మతులు చేసిన యూటీ ప్రాంతంలో యూటీ మిడిల్‌వాల్, స్లాబ్ కూలడంతో విడుదల చేసిన నీరు యూటీ ఏరులోకి ప్రవహించింది. వెంటనే గమనించిన అధికారులు అప్రమత్తమై నీటివిడుదలను నిలిపివేశారు. దీంతో గత 20 రోజ్జాలుగా చేసిన మరమ్మతులు వృధా ప్రయాసగా మారింది. ఇప్పటికే పంటలు ఎండుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులకు సాగర్ జలాలకోసం మరో రెండు మూడురోజుల వరకు నిరీక్షణ తప్పని పరిస్థితి నెలకొంది.

జరిగింది ఇదీ...

అగస్టు 31తేదీన కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలకు పాలేరు జలాశయం దిగువన అండర్ టన్నెల్ వద్ద భారీ గండి పడిన విషయం తెలిసిందే. ఇక్కడ రెండు వైపులా కాలువ కట్టలతో పాటు, 1968లో నిర్మించిన యూటీ సైతం ధ్వంసం అయింది. కాల్వ అడుగు భాగంనుంచి వాగు ప్రవహిస్తుంది. మూడు మీటర్ల వెడల్పు, మూడు మీటర్ల ఎత్తులో రెండు భాగాలుగా నిర్మించిన స్లాబ్‌లో కుడి, ఎడమ భాగాలు వాగు ఉధృతికి కుప్పకూలింది. ఒక భాగాన్ని బ్లాక్ చేసి మరొక భాగం ద్వారా ఊటనీరు ప్రవహించేలా పనులు పూర్తి చేశారు. అయితే శనివారం పనులు పూర్తిచేసి నీటిని విడుదల చేయగా.. యూటీ రెండు భాగాల మధ్యలో ఉన్న గోడతో పాటు, స్లాబ్ కూలిపోయింది. దీంతో ఎడమ కాలువకు విడుదల చేసిన నీరు యూటీ ద్వారా వాగులో కలుస్తోంది. దీంతో అధికారులు నీటి విడుదల నిలిపి వేశారు.

బయటపడిన డొల్లతనం

సాగర్ ఎడమకాలువ మరమ్మతుల్లో ఐబీ అధికారుల డొల్లతనం కనిపించిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులను పక్కాగా నిర్వహించాల్సి ఉండగా అలా చేయలేదని అందువల్లే మళ్లీ బుంగ బయటపడిందని ఆరోపిస్తున్నారు. అండర్ టన్నెల్ గోడ 87 మీటర్లు పొడవు ఉండగా కుడిపక్క, ఎడమపక్క కూలినప్రాంతంలో మాత్రమే ఓపెన్ చేసి ఎక్కడ గోడ కూలిందో అక్కడే కాంక్రీట్ చేశారని, మొత్తం యూటీ ఓపెన్ చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని తెలిపారు. దీంతో లీకులు బయటపడి మళ్లీ మొదటికి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పంటలన్నీ ఎండిపోతున్నాయని, మరో రెండుమూడు రోజులైతే పంట చేతికందే పరిస్థితి ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎర్రుపాలెంకు మహర్దశ

- 58 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు
- పచ్చజెండా ఊపిన రాష్ట్ర కేబినెట్
- ఫలించిన డిప్యూటీ సీఎం భట్టి కృషి



ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయించిన రేమిడిచర్లలోని రెవెన్యూభూమి

ఖమ్మం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గంలో పారిశ్రామికాభివృద్ధికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల గ్రామంలో సర్వేనెంబరు 372లో రెవెన్యూశాఖకు సంబంధించిన 58ఎకరాల భూమిని పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనకోసం కేటాయిస్తూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో 58ఎకరాల భూమి ఇండస్ట్రియల్ పార్కుకు బదిలీ కానుంది.

వాస్తవానికి ఇక్కడ డ్రోన్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఉపముఖ్యమంత్రి విక్రమార్క ప్రతిపాదించారు. కేంద్ర రక్షణశాఖ దృష్టికి కూడా తీసుకెళ్లడంతో పరిశీలనా బృందం వచ్చి వెళ్లింది. అయితే ఈ స్థలం సరిపోదని చెప్పడంతో డ్రోన్ టెస్టింగ్ సెంటర్ ప్రతిపాదనకు బ్రేక్ పడినట్టు తెలిసింది. ఈ స్థలంలో ఇప్పుడు ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయడం ద్వారా పలురకాల పరిశ్రమలు ఏర్పాటుచేసి పారిశ్రామిక ఉత్పత్తులు పెంచడం ద్వారా ఆ ప్రాంతంలో నిరుద్యోతులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లతోపాటు ఆటోమొబైల్, పలురకాల పారిశ్రామిక వర్క్‌షాపులు, చిన్నతరహా పనిముట్ల తయారీతోపాటు వ్యవసాయ సాంకేతిక అనుబంధ పనిముట్ల తయారీ వంటి కేంద్రాలను ఇక్కడ ఏర్పాటు చేయబోతున్నారు.

అయితే రాష్ట్రస్థాయిలో పలు గుర్తింపు పొందిన కంపెనీల నుంచి కూడా ఇక్కడ ఇండస్ట్రియల్ యూనిట్లు పెట్టించేందుకు విక్రమార్క ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే కొందరు పారిశ్రామికవేత్తలతో మధిర ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కలిపిస్తామని సూచించారు. రెండురాష్ట్రాలకు సరిహద్దున ఎర్రుపాలెం మండలం ఉన్నందున ఇక్కడి ఉత్పత్తులను రెండు రాష్ట్రాలతోపాటు గన్నవరం ఎయిర్‌పోర్టు, విజయవాడ రైల్వే స్టేషన్‌కు దగ్గరగా ఉన్నందున ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు కూడా రవాణ చేసే సౌలభ్యం కూడా కలగనుంది. ఈ పరిస్థితి దృష్ట్యా రేమిడిచర్ల ఇండస్ట్రియల్ పార్కుకు మొదటిదశగా 58 ఎకరాలు కేటాయించారు. దీనిని ప్లాట్లుగా విభజించి ముందుకు వచ్చిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు భూములు కేటాయించి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోబోతున్నారు.

యూరియా.. బ్లాక్ మాయా

- అసలు ధర రూ.266.50... బ్లాక్ మార్కెట్‌లో రూ.320...
- డీలర్ల సిండికేట్... నష్టపోతున్న రైతులు
- పంటల సాగు పెరగడంతో డిమాండ్



6

ప'రేషన్' కష్టాలు తీరేనా?

- కార్డుల జారీ ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు
- అవసరమైన చేర్పులు మార్పులకు అవకాశం...?



7

భళా.. గాజర్ల కృష్ణ

- నెట్టింటి మోసాలపై స్వచ్ఛంద ప్రచారం
- అవగాహన కల్పిస్తున్న మెకానిక్
- ద్విచక్ర వాహనంపై వినూత్న ప్రచారం
- ఆసక్తిగా తిలకిస్తున్న నగరవాసులు



6

భద్రాద్రి లడ్డూ భద్రమేనా!



- ఏటా 70 టన్నుల నెయ్యి వినియోగం
- 16 ఏళ్లపాటు కరీంనగర్ డెయిరీ నుంచి సరఫరా
- ఆగస్టు నుంచి జంగారెడ్డిగూడెం రైతు డెయిరీ సరఫరా
- నాణ్యత పరిశీలన చేయాలని ఆహారభద్రత అధికారికి లేఖ

భద్రాచలం, సెప్టెంబరు 21: తిరుపతి లడ్డూలో వినియోగిస్తున్న నెయ్యిపై వివాదం తలెత్తిన నేపథ్యంలో దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రంలో లడ్డూ, చెక్కర పొంగలి తయారీకి వినియోగిస్తున్న నెయ్యి భద్రమేనా అనే చర్చ సాగుతోంది. భద్రాచలం దేవస్థానం గత 16ఏళ్లుగా కరీంనగర్ డెయిరీ నుంచి నెయ్యిని తీసుకోవడం జరుగుతోంది. అయితే అంతకంటే తక్కువ ధరకు జంగారెడ్డిగూడెం రైతు డెయిరీ నుంచి నెయ్యిని సరఫరా చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడంతో ఆగస్టునుంచి ఆ నెయ్యినే వినియోగిస్తున్నట్లు దేవస్థానం అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.ఇదిలా ఉండగా ఇటీవల వరకు దేవస్థానం ఇచ్చిన ముడిసరుకులతో కాంట్రాక్టరు ఆధ్వర్యంలో లడ్డూ, ఇతర ప్రసాదాల తయారీ నిర్వహించేవారు. అయితే ఇటీవల జూలై నుంచే దేవస్థానమే స్వయంగా వీటి తయారీని చేపట్టినట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి.

ఏటా 70 టన్నుల నెయ్యి

భద్రాద్రి దేవస్థానం నెలకు సుమారు ఐదు టన్నుల నెయ్యిని వినియోగిస్తుండగా సంవత్సరానికి 60 టన్నుల నెయ్యి వినియోగం అవుతుంది. కాగా శ్రీరామ నవమి, వైకుంఠ ఏకాదశి, హనుమాన్ జయంతి, గణేష్ నిమజ్జనం సమయంలో తయారు చేసే ప్రత్యేక లడ్డూల కోసం సుమారు మరో పది టన్నుల నెయ్యిని వినియోగిస్తున్నట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రతి ఏటా నవంబరు నుంచి మే వరకు భక్తులు అధికంగా రావడం జరుగుతూ ఉంటుంది. ఈ క్రమంలో ప్రతి రోజు పది నుంచి 12 వేల లడ్డూలను దేవస్థానం తయారు చేస్తోంది. జూన్ నుంచి అక్టోబరు వరకు మూడు నుంచి నాలుగువేల లడ్డూలను ప్రతిరోజు తయారు చేస్తూ ఉంటారు. ఒకవాయికి 400 లడ్డూలు తయారీకి ఆరు కేజీల నెయ్యిని వినియోగిస్తున్నట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి.

16 ఏళ్లు కరీంనగర్ డెయిరీ నుంచి..

రాష్ట్రంలోని కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ వారి నుంచి 16 ఏళ్లపాటు భద్రాద్రి దేవస్థానంకు నెయ్యిని సరఫరా చేయడం జరిగింది. ఆవు, గేదె పాలతో తయారు చేసిన నెయ్యిని కిలో రూ.621 చొప్పున దేవస్థానంకు సరఫరా చేశారు. తాజాగా ఆగస్టు నెల నుంచి జంగారెడ్డిగూడెంలోని లక్కవరంలో ఉన్న రైతుడైరీ నుంచి ఆవు నెయ్యిని కొనుగోలు చేస్తున్నట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నారు. ఇందుకోసం కిలోకు రూ.534 చెల్లించడం జరుగుతోందని తెలిపారు.

నాణ్యత పరిశీలన చేయాలి...

భద్రాద్రి దేవస్థానంలో స్వామి వారి లడ్డూ ప్రసాదంతో పాటు ఇతర ప్రసాదాలకు వినియోగించే అన్ని రకాల ముడిసరుకుల నాణ్యతను పరిశీలన చేయాలని ఆహార భద్రత అధికారికి(ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్) దేవస్థానం అధికారులు అధికారికంగా లేఖ రాసారు. ప్రతి నెల తమకు వచ్చే సరుకుల నాణ్యతను పరిశీలించి నివేదిక అందజేయాలని వారు సంబంధిత అధికారులను కోరారు. ఇదిలా ఉండగా భద్రాద్రి దేవస్థానంలో శ్రీరామనవమి, ముక్కోటి లాంటి ప్రధాన ఉత్సవాలు నిర్వహించే సమయంలో ఆహార భద్రత అధికారులు ముడిసరుకులను సేకరించి వాటి నాణ్యతను పరిశీలిస్తూనే ఉంటారు.

భక్తుల మనోభావాలను దెబ్బతీసే కుట్ర

- టీటీడీపై రాజకీయ పెత్తనాన్ని పూర్తిగా తొలగించాలి
- బోర్డులో అన్యమతస్తులకు అవకాశాలు ఇవ్వడం వల్లే అనర్థాలు
- తిరుపతి లడ్డూ కల్తీపై హిందూ సంస్థల ప్రతినిధుల ఆగ్రహం

6

ఇద్దరు బాలికలపై బాలుడి లైంగికదాడి

- ఇల్లెందులో ఆలస్యంగా వెలుగుచూసిన ఘోరం
- బయటకు పొక్కకుండా కులపెద్దల ఆంక్షలు
- రెండు రోజుల తరువాత పోలీసులకు బాధితుల ఫిర్యాదు



ఇల్లెందు టౌన్, సెప్టెంబరు 21: భద్రాద్రి జిల్లా ఇల్లెందు పట్టణంలో ఆరేళ్ల వయసున్న ఇద్దరు బాలికలపై ఓ బాలుడు (17) లైంగిక దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లెందు పట్టణానికి చెందిన ఓ బాలుడు స్థానికంగా ఉన్న ముగ్గురు బాలికలకు మాయమాటలు చెప్పి ఓ ఇంట్లోకి తీసుకెళ్లాడు. అక్కడ వారిని ఒక గదిలో బంధించి ఇద్దరిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. మరో బాలిక అక్కడినుంచి తప్పించుకుని బయటికి వచ్చి జరిగిన విషయాన్ని వారి తల్లిదండ్రులకు తెలిపింది. రెండు రోజుల క్రితం జరిగిన ఘటనలో అదే రోజు రాత్రే కులపెద్దలు బాలికల తల్లిదండ్రులను కూర్చోబెట్టి పంచాయితీ చేశారు. బాధిత బాలికలతో పాటు లైంగికదాడికి పాల్పడిన బాలుడు ఒకే కులానికి చెందిన వారు కావడంతో కుల పెద్దలు ఈ విషయం బయటికి పొక్కనివ్వలేదు. అయితే శనివారం విషయం బయటకు రావడంతో ఐసీడీఎస్ అధికారులు విచారణ చేసేందుకు రాగా స్థానికులు ఎవరూ వారికి సహకరించలేదు. ఈ ఘటనపై పోలీసులకు చెబితే కులబహిష్కరణ చేస్తామని కుల పెద్దలు హెచ్చరించడంతో బాధితులు మౌనంగా ఉండి శనివారం ఇల్లెందు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేసి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.



అపరాధంపై ఆగ్రహం

- శ్రీవారి ప్రసాదాన్ని 'అపవిత్రం చేశారు...'
- తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలెపెట్టొద్దు
- కోట్లాది భక్తుల మనోభావాలతో చెలగాటం

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 21: కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయంలో గత కొన్ని రోజులుగా స్వామివారికి అత్యంత ప్రీతికరమైన లడ్డు తయారీలో కల్తీనూనె, నెయ్యి వినియోగించి భక్తుల మనోభావాలను దెబ్బతీసేందుకు పెద్ద కుట్ర జరిగిందని తెలుస్తోంది. హిందువులకు పరమ పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమల. తెలుగు రాష్ట్రాల నుంచే కాగా దేశ విదేశాల నుంచి కోట్లాది మంది భక్తులు స్వామివారి దర్శించుకుంటారు. స్వామివారిని ఎంత భక్తిభావంతో కొలుస్తారో లడ్డు ప్రసాదాన్ని కూడా అంతే పవిత్రంగా భావిస్తారు. లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించారని నివేదిక రావటంతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. కల్తీ నూనె వినియోగించిన అప్పటి పాలకులను, అధికారులపైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి

టి. సీతారామశాస్త్రి, జిల్లా వైదిక బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు

ప్రఖ్యాతిగాంచిన దేశ విదేశాలలో స్వామివారి ప్రసాదం అంటే అందరికీ గుర్తొచ్చేటటువంటిది తిరుమల లడ్డు ప్రసాదం. ఈ లడ్డు ప్రసాదంలో ఈ మూడు నాలుగు రోజులు బట్టి వస్తున్నటువంటి కల్తీ విషయంలో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. ఏదైనా స్వామివారి ప్రసాదాన్ని కల్తీ చేసేటటువంటి వారిని ఉపేక్షించకుండా శిక్ష విధించాలి. అయితే ఏదైనా సరే బయటికి రాకుండా శిక్షపడేటట్టుగా చేయాలి.

కల్తీ పదార్థాలు కలువటం దురదృష్టకరం

రఘునాథ చార్యులు, వైష్ణవ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు



భగవంతుని భక్తులమైన మనం నైవేద్యంలో చిన్న నలక ఉంటేనే నైవేద్యం పెట్టం. అలాంటిది కలియుగ ప్రత్యక్షదైవం శ్రీతిరుమల వెంకటేశ్వర స్వామి వారికి ఎంతో ప్రీతికరమైన లడ్డూ ప్రసాదంలో కల్తీ పదార్థాలు కలవటం అత్యంత దురదృష్టకరం. ఈ విషయం పై తిరుమత ఆలయ అర్చకులు ఆగ పండితులు, జీయర్ స్వాములు స్పందించాలి.



టీటీడీపై రాజకీయ పెత్తనాన్ని తీసివేయాలి

ఆమంచి సురేష్‌శర్మ, పౌరోహితుడు ఖమ్మం

తిరుపతి లడ్డు వ్యవహారం భక్తులకు తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. ఎంతో పవిత్రమైన లడ్డు తన ఆకృతి, నాణ్యత తగ్గిందని పలుసార్లు ఫిర్యాదు చేసిన అధికారి టీటీడీ అధికారులు పట్టించుకోలేదు. టీటీడీని తమ స్వార్థ రాజకీయాలకు వాడుకొని అధికార దాహంతో స్వామివారి ఆస్తులను దిగమింగుతూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు.

హిందూజాతిని కలవరానికి గురిచేశాయి

కోనూరి ప్రసాద్, నియోగి బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు



తిరుపతి బాలాజీ ప్రసాదం అందరికి చాల ప్రీతీ పాత్రమైనది. స్వామి వారిని దర్శించుకొన్న తరువాత తిరుపతి లడ్డుని కొనుక్కొని ఇంటికి చేరుకొని బంధువులకు స్నేహితులకు భక్తిపూర్వకంగా పంచటం జరుగుతుంది . కానీ ఈ మధ్య వచ్చిన వార్తలు మమ్ములను, యావత్ హిందూజాతిని కలవరానికి గురిచేశాయి. ఈ లడ్డు తయారీకి ఉపయోగించిన నేతిలో ఫిష్ ఆయిల్, గొడ్డుమాంసం అవశేషాలు బయట పడ్డాయి.



పవిత్రతను దెబ్బతీయడానికి జరిగిన కుట్ర

శ్రీధర్ శర్మ, టీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర యువజన అధ్యక్షుడు

తిరుపతి లడ్డులో కల్తీ అనేది గత కొంతకాలం నుంచి అనిపిస్తూనే ఉంది. దాన్ని నాణ్యత, రుచిలో తేడా వచ్చింది అని అనేకసార్లు కూడా ఫిర్యాదులు వచ్చినా టీటీడీ అధికారులు నిద్రావస్థలో వున్నారు. ఈరోజు అది నిజం అని తేలింది. భక్తుల మనోభావాలు, తిరుపతి పవిత్రతను దెబ్బతీయడానికి జరిగిన కుట్రగా భావించాల్సి వస్తుంది.

అన్యమతస్థులకు అవకాశాలు ఇవ్వడం వల్లే..

రమేష్ శర్మ, జిల్లా దూపదీప నైవేద్యం అర్చక సంఘం అధ్యక్షుడు



పక్కా ప్రణాళిక ప్రకారం తిరుపతి దేవస్థానం ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నాల జరుగుతున్నాయి. దానిలో భాగంగానే ప్రస్తుతం లడ్డు కల్తీ విషయం అని అనిపిస్తుంది. హిందువుల మనోభావాలు దెబ్బతీయాలని స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన తిరుపతి దేవాలయంలో రాజకీయ నాయకుల ప్రవేశంతో అన్యమతాల ప్రవేశం చేస్తూ హిందూ మతాన్ని హిందువుల ఆరాధ్య దైవాన్ని కించపరుస్తూ టీటీడీని భ్రష్టు పట్టిస్తున్నారు.



ప్రక్షాళన చేసి.. స్వామీజీలకు అవకాశం కల్పించాలి

ఎం. వీరభద్ర ప్రసాద్ శర్మ స్తంభాద్రి పురోహిత సంఘ అధ్యక్షుడు

అత్యంత పవిత్రంగా భావించే తిరుపతి లడ్డులో, కలుషితమైన దేనికి పనికిరాని కొవ్వు పదార్థాన్ని ఉపయోగించి, పిల్లి పాలు తాగుతూ ఎవరూ చూడలేదని అనుకోవడం గత ప్రభుత్వ తీరుకు పరాకాష్ట. హిందూ దేవాలయ దేవాలయాల పవిత్రతను, విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు పన్ని వారిని తక్షణమే అరెస్టు చేయాలి.

లడ్డూ వివాదం తిరుపతి పవిత్రతకు భంగకరం

డా.బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, భద్రాద్రిప్రాంత పరిరక్షణ సమితి



తిరుపతి లడ్డూలో జంతు నూనెలు కలుస్తున్నాయని సాక్షాత్తూ ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడించడం అత్యంత దురదృష్టకరం. రాజకీయాల్లో ఎత్తులు పై సహజమే కాని, పరమపవిత్రమైన తిరుమల తిరుపతి శ్రీవారి లడ్డూ విషయంలో భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా కల్తీ చేయడం తీవ్ర విచారకరం.



సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

గాదె మాధవరెడ్డి, భద్రాచలం

తిరుమల తిరుపతి లడ్డూకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పేరుంది. ఈ విషయంలో రాజకీయం చేయడం కన్నా సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తి లేదా సీబీఐ విచారణ చేట్టాలి. వాస్తవమని తేలితే దోషులపై కఠినంగా చర్యలు తీసుకోవాలి. ఎంతో పవిత్రంగా భక్తులు భావించే వెంకన్న సన్నిధిలో ఇటువంటి ఘటన వెలుగులోకి రావడం అందరిని ఎంతగానో ఆవేదనకు గురి చేస్తోంది. అయితే ప్రభుత్వం పూర్తిపాదర్శకతతో విచారణ నిర్వహించి సంబందిత అధికారులు, లేదా కాంట్రాక్టరుపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి.

23న బ్లాక్‌డేను జయప్రదం చేయండి

- అఖిలపక్ష కార్మిక రైతుసంఘాల నేతలు

ఖమ్మంటౌన్, సెప్టెంబరు 21: కేంద్రప్రభుత్వం కార్మిక రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కిసాన్ సంయుక్తమోర్చా (ఎస్‌కేఎం) ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 23న దేశవ్యాప్త బ్లాక్‌డేను జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక, రైతుసంఘాలు పిలుపునిచ్చాయి. నగరంలోని మంచికంటిభవన్‌లో శనివారం అఖిలపక్ష కార్మిక, రైతుసంఘాల సంయుక్త సమావేశం ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎండీవై.పాషా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ మోదీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గళం విప్పాల్సిన అవసరం ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. రైతులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన మూడు నల్లచట్టాలతో పాటు కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్‌మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం అన్ని జిల్లా కేంద్రాల్లో నల్లజెండాలతో నిర్వసన తెలియచేస్తూ బ్లాక్‌డేను నిర్వహించాలని పిలుపునిచ్చారు.



బ్లాక్ మార్కెట్‌లో యూరియా

- అసలు ధర రూ.266.50... బ్లాక్‌మార్కెట్‌లో రూ.320...
- డీలర్ల సిండికేట్... నష్టపోతున్నరైతులు
- పంటల సాగు పెరగడంతో యూరియాకు డిమాండ్

ఖమ్మం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో భారీ వర్షాలు తగ్గడం, వ్యవసాయ పంటలు సాగు ముమ్మరంగా ఉంటున్న నేపథ్యంలో యూరియా డిమాండ్ అధికంగా ఉంది. ఇదే అదనుగా యూరియాను హోల్‌సేల్ డీలర్లు కొందరు అధిక ధరలకు డీలర్లకు అందిస్తుండడంతో అసలు ధరకు మించి బ్లాక్ ధర జోరుగా సాగుతోంది. 45కేజీల బస్తా రూ.266.50 పైసలకు ఎంఆర్‌పీ ధర ఉండగా గ్రామాల్లో డీలర్లు యూరియా బస్తా రూ.320పైగా అమ్మకాలు సాగిస్తున్నారు. కొంత మంది యూరియాతో పాటు ఇతర ఎరువులకు లింక్‌పెట్టి విక్రయిస్తున్నారు. సొసైటీల్లో అసలు ధరలకే ఎరువులు అమ్ముతుండగా ప్రైవేటు డీలర్ల దగ్గర రేటు భారంగా ఉంది.

ఎరువుల నిల్వలున్నాయని చెబుతున్నా....

వాస్తవానికి జిల్లాలో ఎరువులు నిల్వలు బాగానే ఉన్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నప్పటికి క్షేత్రస్థాయిలో పరిస్థితి విరుద్ధంగా ఉంది. ప్రస్తుతం వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు పలురకాల పంటలకు యూరియా డిమాండ్ అధికంగా ఉంది. జిల్లాలో మార్క్‌ఫెడ్ వద్ద 11124 మె.ట., కంపెనీ డీలర్లవద్ద 285మె.ట. కామన్‌పూల్ కింద ముందుజాగ్రత్తగా వ్యవసాయశాఖ కమిషన్ పరిధిలో 9443మె.ట. యూరియాస్టాకు ఉంది. ఇవి కాకుండా డీఏపీ 4369మె.ట., ఎంపీకే 20476మె.ట., పొటాష్ 2973మె.ట., సింగిల్ సూపర్ 1156 మె.ట. ఎరువుల నిల్వలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 634మంది ఎరువుల డీలర్లుండగా ఇందులో 77 సహకార సంఘాల ఎరువుల విక్రయ కేంద్రాలున్నాయి. 42 ఆగ్రో రైతు కేంద్రాలున్నాయి. జిల్లాలో 19మంది వరకు హోల్‌సేల్ వ్యాపారులు ఎరువులను రిటైల్ డీలర్లకు విక్రయిస్తున్నారు. మార్క్‌ఫెడ్‌కు కేటాయించిన ఎరువులను సొసైటీలకు ఎంఆర్‌పీ ధరలకు విక్రయిస్తుండగా హోల్‌సేల్ వ్యాపారులు మండలాలు, గ్రామాల్లోని డీలర్లకు ఎరువుల విక్రయాల్లోనే బ్లాక్‌దందా నడుస్తోంది.

హోల్‌సేల్ డీలర్ల సిండికేట్

ఖమ్మంలోని కొంతమంది హోల్‌సేల్ డీలర్లు సిండికేట్‌గా మారారు. రవాణా ధర అధికంగా పడుతుందని, ఎగుమతి, దిగుమతి చార్జీలు భారంగా ఉన్నాయని చెబుతూ యూరియా, డీఏపీని బ్లాక్‌చేస్తున్నారు. ప్రస్తుతం యూరియా, డీఏపీ డిమాండ్ అధికంగా ఉంది. ఎంఆర్‌పీ ధరలకంటే ఎక్కువ విక్రయిస్తున్నారు. యూరియా ధర 45కేజీల బస్తా రూ.266.50పైసలుండగా రూ.320కిపైగానే గ్రామాల్లో, మండలాల్లో ప్రైవేటు డీలర్లు అమ్ముతున్నారు. వారికి కూడా హోల్‌సేల్ డీలర్ల నుంచి బస్తా రూ.300వరకు అమ్ముతుండగా పైన రూ.20 లాభం చూసుకుని విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితి కారణంగా గ్రామాల్లో రైతులు అధిక ధరలకు యూరియా, డీఏపీ కొనుగోలు చేసే పరిస్థితి నెలకొంది. డీఏపీ 50కేజీల బస్తా రూ.1350 ఉండగా మరో రూ.20 అదనంగా చేర్చి అమ్ముతున్నారు.

రవాణా, ఎగుమతి, దిగుమతి చార్జీల పేరుతో ఇతర ఎరువులకు సైతం ఎంఆర్‌పీ ధరలకేంటే ఎక్కువ ధరకు రైతులకు విక్రయిస్తున్నారు. వాస్తవానికి సొసైటీల్లో అమ్మినట్టుగానే డీలర్లు గ్రామాలు, మండలాల్లో ఎంఆర్‌పీ ధరలకే ఎరువులు విక్రయించాలి. అయితే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ఎరువుల విక్రయాలు మండల కేంద్రాలకే పరిమితమవుతున్నాయి. రైతులు పలు గ్రామాల్లో ఉండడంతో స్థానిక అవసరాలకు ప్రైవేటు డీలర్లనుంచే క్రయవిక్రయాలు అధికంగా జరుగుతున్నాయి. సొసైటీలో ఎరువుల అమ్మకాలు ఉదయం 10గంటలనుంచి సాయంత్రం 4-30గంటల వరకు ఉండడంతో రైతులకు కూడా కొంత ఇబ్బందికర పరిస్థితి ఉంది. పొలాలకు వెళ్లే రైతులు ఉదయమే ట్రాక్టర్ల, ఎడ్లబండిపై ఎవరులు కొనుగోలుచేసుకుని వెళుతుంటారు సొసైటీలోని ఎరువుల షాపులు ఉదయమే తీయకపోవడంతో ప్రైవేటు షాపుల్లోనే కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఎరువుల ధరలపైనా వ్యవసాయశాఖతో పాటు విజిలెన్సు అధికారులు కూడా నిఘా ఉంచాలని రైతాంగం కోరుతుంది.

పంటల సాగు పెరగడంతో....

గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి జిల్లాలో అన్ని పంటలు సాగులో ఉన్నాయి. ప్రస్తుతం కురిసిన వర్షాలతో కొన్నిచోట్ల ఎర్రబడడంతో అటు వరి, ఇతర పంటలకు యూరియా, డీఏపీ డిమాండ్ అధికంగా ఉంది. జిల్లాలో పత్తి 1,91,000 ఎకరాలు, వరి 1,72,000ఎకరాలు, కంది 512 ఎకరాలు, మొక్కజొన్న 2313 ఎకరాలు, మినుము 102 ఎకరాలు జనుము 28,499ఎకరాలు, పెసర 15242ఎకరాలలో వేశారు. మిర్చిపంట కూడా రైతులు అధికంగా వేస్తున్నారు. కొన్నిచోట్లపై పాటు దశకు వచ్చాయి. ఇప్పటికే జిల్లాలో 4,15,000ఎకరాలపై గా అన్ని రకాల పంటలు వేశారు. ఈనేపథ్యంలో ఎరువుల డిమాండ్ కూడా అధికంగా ఉంది. ప్రస్తుతం వరి పంటకు కలుపులు తీయడం, వర్షాలు , వరదలకు వరి మళ్ల పట్టిన చోట కలపులు తీసి యూరియా వేస్తున్నారు. పత్తి,మిర్చి,మొక్కజొన్న వంటి పంటలకు పైపాట్లతో యూరియా, డీఏపీలు వాడకం అధికంగా ఉంది. డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని ఖమ్మంలోని కొందరు హోల్‌సేల్ వ్యాపారులు తమకు కేటాయించిన కోటాను అధిక ధరలకు డీలర్లకు ఇస్తున్నందున డీలర్లు కూడా క్షేత్రస్థాయిలో దరలు పెంచి యూరియా తదితర ఎరువులు విక్రయిస్తున్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు

డి. పుల్లయ్య జిల్లా వ్యవసాయాధికారి

జిల్లాలో యూరియా కొరతలేదు. రైతులకు అవసరమైనంత మేర అందుబాటులో ఉందని, ఎంఆర్‌పీ ధరకే అమ్మాలి తప్ప, అధికధరలకు యూరియాతో పాటు ఇతర ఎరువులు అమ్మితే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుతుందని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య తెలిపారు. ఇప్పటి వరకు రైతులు తమకు ఫిర్యాదు చేయలేదని అయినా క్షేత్రస్థాయిలో ఎరువుల ధరలపై నిఘా ఉంచుతామని తెలిపారు. ప్రస్తుతం ఎండలు కాస్తున్నందున యూరియా డిమాండ్ కూడా తగ్గిందని, వర్షాలు వస్తున్నప్పుడే యూరియా డిమాండ్ ఉంటుందని కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరకు అమ్మితే చర్యలు తప్పవని మండల ఏవోలకు రైతులు ఫిర్యాదుచేయాలని తెలిపారు.

ఆపద వేళ రావేల?

(5వ పేజీ తరువాయి)

కురిసిన భారీ వర్షాలతో కృష్ణా పరివాహక ప్రాంతంలోని నాగార్జున్‌సాగర్ పూర్తిస్థాయిలో నిండటంతో సీతారామ జలాలు రైతులకు అంతగా అవసరపడలేదు. అయితే భారీ వర్షాలు, వరదలతో సాగర్ ఎడమకాల్వకు గండ్లు పడి 20రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో సాగర్ ఆయకట్టులో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. చిరుపొట్ట దశలో వేల ఎకరాల్లో ఎండిపోతోంది.

అసంపూర్తిగా రాజీవ్ లింక్ కెనాల్...

ఆగస్టు 15నాటికి రాజీవ్ లింక్ కెనాల్‌ను పూర్తిచేసేందుకు వేగంగా పనులు నిర్వహించారు. అయినా ఇంకా పదిశాతం పనులు పూర్తికావాల్సి ఉంది. కొన్నిచోట్ల భూనిర్వాసితులకు పరిహారం చెల్లించాల్సి ఉంది. భారీ వర్షాలు, వరదల కారణంగా లింక్ కెనాల్ పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాల్వ తవ్వకం పూర్తయినా శాశ్వత నిర్మాణాలు మిగిలిపోయాయి. ఆ నిర్మాణాలు చేయకుండా నీరు విడుదల చేస్తే కాలువ గట్ల నుంచి మట్టి జారిపోయి కాల్వలు పూడిపోయే ప్రమాదం ఉంది. ఫలితంగా రాజీవ్ లింకు కెనాల్‌నుంచి ఇంతవరకు చుక్క గోదావరి నీరు వైరా రిజర్వాయర్‌కు రాలేదు.

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- జిల్లాలో కుంటుపడిన పారిశ్రామికాభివృద్ధి
- ఎన్ఎండీసీ విషయంలో బీజేపీ సహకారం
- పర్యాటకానికి చేయూత నిస్తా
- బీజేపీ రాష్ట్రనాయకుడు వినోదరావు

లక్ష్మీదేవిపల్లి/ సుజాతనగర్, సెప్టెంబరు 21: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఖమ్మంలో వచ్చిన వరదలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, వరద బాధితులను సకాలంతో అదుకోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమ్మైని బీజేపీ రాష్ట్ర నాయకుడు తాంద్ర వినోదరావు విమర్శించారు. శనివారం కొత్తగూడెంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలో విచ్చిన వరదలకు ఇబ్బంది పడుతున్న ప్రజలకు కనీస సౌకర్యాలను వెనువెంటనే అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం మెతక వైకరి అలంబించడం దురదృష్టకరమన్నారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి కుంటుపడిందని గుర్తుచేసారు. పాల్వంచలో 800మేగా వాట్ల ప్లాంటును వెంటనే ప్రారంభించాలన్నారు.. ఎన్ఎండీసీ పై కేంద్రంతో రాష్ట్రప్రభుత్వం చర్చలు జరపాలని, ఈ విషయమై రాష్ట్ర బీజేపీ సహకారం ఉంటుందన్నారు.

సింగభూపాలెం చెరువు పర్యాటకానికి అవకాశాలు పుష్కలం

సింగభూపాలెం చెరువు పర్యాటకానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, కరకట్ట పటిష్టతకు ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించాలని ఖమ్మం బీజేపీ ఎంపీ కంటెస్టెడ్ అభ్యర్థి తాంద్ర వినోద్‌రావు అన్నారు. శనివారం సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువు కరకట్టను ఆయన పరిశీలించి, ఇరిగేషన్ పై అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అక్కడే ఉన్న ఇరిగేషన్ సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెరువు శిఖం భూమి 1,248 ఎకరాల్లో విస్తరించి సువిశాలంగా, ప్రకృతి అందంతో తులతూగుతుందని, 2500 ఎకరాల ఆయకట్టుతో చెరువు సుందరంగా ఉందని, చెరువు అభివృద్ధికి నా వంతు తోడ్పాటు నందిస్తానని అన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలలో పనర్యటించి తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను పరామర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తాంద్ర వినోదరావు

కాండం తెగులుతో.. ఆయిల్‌పామ్‌కు నష్టం..

- జిల్లాలో ఇటీవల పెరుగుతున్న తెగులు
- సత్తుపల్లిలో తోటలను పరిశీలించిన అధికారులు



నారాయణపురంలో తోటలు పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబరు 21: కాండం తడి తెగులు అనేది ఆయిల్‌పామ్ తోటల్లో అత్యంత ప్రమాదకరమైనది. మురుగు నీటి సౌకర్యం లేని, నీరు ఎక్కువ కాలం పట్టుకొని ఉండే నల్ల నేలలు, నేలలో నీటి పొర బాగా తక్కువ లోతులో ఉన్న ప్రాంతాలు ఆయిల్ పామ్ సాగుకి అంత అనుకూలంగా ఉండవు. ఈ మధ్య కాలంలో ఖమ్మం జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో ఈ తెగులు ఉధృతి అధికం అయింది.

లక్షణాలు:

ఈ తెగులు ఆశించిన మొక్కల మొదళ్లలోని పగుళ్ల నుంచి ముదురు గోధుమ రంగులో ఉన్నద్రవం కారుతుంది. మధ్య వరుసలోని ఆకులు ముదురు గోధుమ రంగులోకి మారుతాయి. తెగులు ముదిరే కొద్దీ- కాండం బెరడు క్రింద ఉండే కణజాలం పూర్తిగా కుళ్లిపోయి మోవులోని విచ్చుకొని ఆకులు, వాటి కింద ఉన్న లేత ఆకులు వడలి చనిపోతాయి. ఆ తరువాత మిగిలిన ఆకులు పసుపు రంగులోకి మారి త్వరగా వడలిపోయి చనిపోతాయి. ఈ తెగులు ధృవీకరించుకోవడానికి గడ్డపారతో మొదలు దగ్గరగా కాండముపై బలంగా గుచ్చితే గోధుమరంగులో భరించలేని చెడు వాసన కలిగిన ద్రవం బయటకు వస్తుంది. ఈ తెగులు తీవ్ర దశలో ఉన్నప్పుడు కాండం బెరడు కొన్ని అంగుళాలు మాత్రమే గట్టిగా ఉండి లోపలి కణజాలం అంతా కుళ్లిపోయి ఉంటుంది.

ఏం చేయాలంటే...

తెగులు సోకి చనిపోయిన చెట్లను తోట నుండి తీసివేసి పూర్తిగా కాల్చివేయాలి. సిఫారసు చేసిన సాగు పద్ధతులు పాటిస్తూ, తోటకు మెరుగైన మురుగు నీటి పారుదల సదుపాయం కల్పించాలి. తోటను నీటి ముంపునకు గురికాకుండా చూసుకోవాలి. తెగులు ప్రారంభ దశలో ఉన్నట్లయితే, కాండమునకు శస్త్రచికిత్స చేసి మొక్కను రక్షించుకోవచ్చును.

కాండం శస్త్రచికిత్స:

పదునుగా ఉన్న గడ్డపారతో కాండంపై గాటు పెట్టి కుళ్లిన కణజాలాన్ని, దానిని ఆనుకొని ఉన్న ఆరోగ్యకరమైన కణజాలాన్ని తీసివేయాలి. దానిపై కార్బనైజమ్ (1%), మోనోక్రోటోఫాస్ (1 మి.లీ.)ల మిశ్రమాన్ని పూసి ఆపై వేడిగా ఉన్న కోల్తార్ పూయాలి. తరువాత ఇసుక, సిమెంట్ కలిపిన మిశ్రమంతో బొరియను పూర్తిగా మూసివేయాలి. ఒకేసారి కుళ్లిన కణజాలాన్ని పూర్తిగా తీసివేయనట్లయితే తెగులు మళ్లీ ఆశించే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి అవసరమైతే 10-15 రోజుల తరువాత పైన వివరించిన విధంగా మరోసారి శస్త్రచికిత్స చేసి ఈ తెగులును నియంత్రించవచ్చు. స్ట్రెప్టోమైసిన్ (10గ్రా లీటరు నీటిలో కలిపి) లేదా గ్లోయిట్ 10 మి.లీ. మందును 90 మి.లీ. నీటిలో కలిపి కాండం ద్వారా చెట్టుకి ఎక్కించి గాని లేదా గ్లోయిట్ 80 మి.లీ. మందుని 40 లీటర్ల నీటిలో కలిపి మొక్క పాదిలో పోసుకొని గాని ఈ తెగులును నియంత్రించవచ్చు.

తోటల పరిశీలన

కాండం తడి తెగులుపై సూచనలు

ఆయిల్ పామ్‌లో అధికం అవుతున్న కాండం తడి తెగులు నివారణకు అధికారులు జిల్లాలో పర్యటించారు. శనివారం సత్తుపల్లి మండలం నారాయణపురంలోని రోగం సోకిన ఆయిల్‌పామ్ తోటలను పంటలను పరిశీలించారు. రాష్ట్ర ఆయిల్‌పామ్ కన్సల్టెంట్ సీనియర్ సైంటిస్ట్ (రిటైర్డ్) బి. నరసింహ రావు, ఖమ్మం జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి ఎంవీ మధుసూదన్, ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ డివిజినల్ మేనేజర్ బాల కృష్ణ, రాజశేఖర్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ తోటలను పరిశీలించారు.

నారాయణపురంలోని శ్రీనివాస్ రెడ్డి, మొరపుడి స్వర్ణలత ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించి, రోగం సోకిన భాగాలను తీసి, నివారణ చర్యలు పాటించి పరిరక్షించుకోవాల్సిన పద్ధతులపై ప్రయోగాత్మకంగా చూపించి, నష్ట నివారణ చర్యలు వివరించారు.

1 నుంచి ధాన్యం కొనుగోళ్లు

- ఏర్పాట్లలో అధికార యంత్రాంగం
- 5.96 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం
- సన్న రకాలకు క్వింటాకు రూ.500బోనస్
- జిల్లాలో 236 కొనుగోలు కేంద్రాలు

ఖమ్మం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): వానాకాలం వరిసాగును దృష్టిలో పెట్టుకుని ధాన్యం కొనుగోళ్లకు జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. వచ్చే నెల 1నుంచి దశలవారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించబోతున్నారు. జిల్లాలో 5.96 లక్షల మె.ట. ధాన్యం సేకరణగా లక్ష్యం పెట్టుకున్నారు. అందులో భాగంగా 236 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించబోతున్నారు. ఇందులో ఐకేపీ సంఘాల ద్వారా 51 కొనుగోలు కేంద్రాలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 155, డీసీఎంఎస్ ద్వారా 30 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. జిల్లాలో లక్షా17వేల హెక్టార్లలో వరి సాగవుతోంది. సత్తుపల్లి నియోజకవర్గంలో అక్టోబరు నుంచే ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున అక్టోబరు 1నుంచి దశలవారీగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నారు. సాధారణ రకానికి క్వింటాకు రూ.2300, ఏ గ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2320ధర నిర్ణయించారు. అయితే సన్నరకాల ధాన్యానికి రూ.500బోనస్ కూడా ఈసారి ఇవ్వ బోతున్నారు. జిల్లాలో 90శాతం సన్నరకాలే రైతులు పండిస్తున్నందున రైతులకు బోనస్ అదనపు ఆదాయం చేకూర్చనుంది.



ఇబ్బందులు రానివ్వం

జిల్లాలో ధాన్యం కొనుగోలులో ఎక్కడా ఇబ్బంది లేకుండా ముందునుంచే ప్రణాళిక రూపొందించామని జిల్లా పౌరసరఫర శాఖ అధికారి కె.చందన్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలో ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టామని ఆదేశించిందని, అందులో భాగంగా 236 కొనుగోలు కేంద్రాల ద్వారా 5.96లక్షల మె.ట. ధాన్యంను సేకరించబోతున్నామని తెలిపారు. అలాగే ఈసారి సన్నరకాల ధాన్యానికి క్వింటాకు రూ.500బోనస్ కూడా ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందని, సోమవారం హైదరాబాద్‌లో ధాన్యం కొనుగోలు విధివిధానాలపై కూడా ప్రత్యేక సమావేశం జరుగుతుందని తెలిపారు. రైతులు తక్కువ ధరకు ఎక్కడా అమ్ముకోవాల్సిన అవసరంలేదని, ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తుందన్నారు.

నెట్టింటి మోసాలపై ప్రచారం

- అవగాహన కల్పిస్తున్న మెకానిక్ గాజర్ల కృష్ణ
- ద్విచక్రవాహనంపై నిత్యం వినూత్న ప్రచారం

ఖమ్మం క్రైం, సెప్టెంబరు 21: సైబర్ మోసాల బారిన పడొద్దంటూ ఓ వ్యక్తి తన ద్విచక్రవాహనంపై వినూత్న ప్రచారం చేస్తున్నాడు. ఖమ్మం నగర శివారులోని గోపాలపురానికి చెందిన గాజర్ల కృష్ణ పద్మారావు నగరంలోని బోనకల్ రోడ్డులో ద్విచక్రవాహన మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అయితే గత 2020 కరోన సమయం నుంచి పలు చైతన్య కార్యక్రమాల్లో వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నాడు. గతంలో ప్రజలు వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరుతు అవగాహన కల్పించాడు. ఆదే విధంగా దేశవ్యాప్తంగా ప్రస్తుతం ప్రజలు సైబర్ మోసాల బారిన పడుతున్న నేపథ్యంలో తనదైన శైలిలో స్పందించాడు. తన ద్విచక్రవాహనంకు బోర్డులు అమర్చి టీషర్టు ధరించి అవగాహన కలిపిస్తున్నాడు. సైబర్‌మోసాల బారిన పడిన వారు ఎవరైనా తక్షణమే టోల్‌ఫ్రీ నెంబరు 1930కు ఫోన్‌చేసి ఫిర్యాదుచేయాలని దాని ద్వారా అకౌంట్‌లోని మాయమైన నగదును ఫ్రీజ్‌చేసే అవకాశం ఉందని ప్రచారం చేస్తున్నాడు. ప్రతిరోజు ఉదయం తను విదలుక వెళ్లే సమయంలో నగరంలో పలు ప్రాంతాల్లో తిరుగుతూ ప్రధాన కూడళ్లవద్ద తన వాహనం ఆపి ప్రజలకు అవగాహన కలిగేలా బోర్డులు పట్టుకుని తిరుగుతున్నాడు. దీంతో స్థానికులు ఆయణ్ను అభినందిస్తున్నారు.



సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న కృష్ణ

48,113 దరఖాస్తులు పెండింగ్‌లో...

- రేషన్ కార్డుల జారీ ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు
- కార్డుల్లో చేర్పులు మార్పులకు అవకాశం...?

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 21: అక్టోబరు 2 నుంచి కొత్తరేషన్ కార్డులను జారీ చేస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో జిల్లాలో వేలాది బాధితుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రేషన్ కార్డుల్లో తప్పొప్పులు సరిచేయాలంటూ 48,113 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీరంతా తహసీల్దారు, జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. గతంలో రేషన్‌కార్డులు కొత్తవి 12 వేలకు పైగా ఇచ్చారు. ఆ సమయంలో ఈ కార్డులకు మోక్షం లభిస్తుందని అంతా భావించారు. కానీ నేటివరకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. దీంతో గత నాలుగేళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు నిరీక్షిస్తున్నారు. ఇదిలా ఉంటే తప్పొప్పులను సరిచేయాలంటూ మండల రెవెన్యూ కార్యాలయాల్లో అధికారులకు దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. ఐదేళ్ల క్రితం పిల్లలు పుట్టిన వారి పేర్లను కార్డులో చేర్చాలంటూ, తన భర్త పేరు కార్డులో తొలగించారని, ఆధార్ కార్డు సీడింగ్ తదితర చేర్పులు మార్పులు సరిచేయడానికి మాత్రం ఇప్పటివరకు అవకాశం కల్పించడంలేదు. ఫలితంగా ఏళ్ల తరబడి రేషన్ బియ్యానికి అర్హులైన లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నిటికీ రేషన్ కార్డే ప్రమాణం..?

కార్పొరేట్ దవాఖానాల్లో వైద్యం పొందాలన్నా... ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత పొందాలన్నా... ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికీ,



విద్యార్థులకు ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఇలా ఏ పథకానికి లబ్ధి పొందాలన్నా రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటున్నారు. దీంతో రేషన్‌కార్డు ప్రజలకు అత్యవసరం అవుతోంది. దీంతో వీటిని పొందడానికి మండల రెవెన్యూ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. రెండు రోజుల క్రితం ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల కోసం అక్టోబరు 2 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించడంతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

కమిషనర్‌కు రాస్తూనే ఉన్నాం..

చందన్‌ఖాన్, డీఎస్వో ఖమ్మం

రేషన్ కార్డుల్లో తప్పొప్పులను సరిచేసేందుకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నమాట వాస్తవమే .48,113 దరఖాస్తులు అందితే వాటిలో 23,870 రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, 2057 దరఖాస్తులు తహసీల్దార్ల వద్ద, 12,567 డీఎస్వో లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. వాస్తవానికి అర్హత కలిగిన దరఖాస్తులు 8876 పెండింగ్‌లో ఉన్నాయి. వీటి కోసం రాష్ట్ర ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తున్నాం. ఇది రాష్ట్ర వ్యాప్తంగా వీలుకల్పించాల్సి ఉంది. త్వరలో వస్తుందని భావిస్తున్నాం.

మండలాల వారీగా దరఖాస్తులు పెండింగ్‌లో ఇలా...

బోనకల్ 1853, చింతకాని 2047, ఏన్కూరు 1237, కల్లూరు 2681, కామేపల్లి 1335, ఖమ్మం అర్బన్ 7852, ఖమ్మం రూరల్ 2194, కొణిజర్ల 1722, కూసుమంచి 2055 మధిర 2729, ముదిగొండ 2040, నేలకొండపల్లి 2154, పెనుబల్లి 2127, రఘునాథపాలెం 1894, సత్తుపల్లి 3127, సింగరేణి 1686, తల్లాడ 1848, తిరుమలాయపాలెం 2062, వేంసూరు 1529, వైరా 1777 ఎర్రుపాలెం 2164 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

- బీజేపీ పాలనలో మహిళలకు కరువైన ఇపాధి
- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

కొత్తగూడెం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల ఉపాధి దారుణంగా పడిపోయిందని, 2018-19 సంవత్సరంలో మహిళలు ఉపాధిలో 21.9శాతం మంది ఉంటే 2022-23 సంవత్సరంలో 15.9 శాతానికి పడిపోయిందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. శనివారం కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో 41మందితో జిల్లా నూతన కమిటీని ఎన్నుకుని పలు అంశాలపై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 90శాతం మంది మహిళలు అసంఘటిత రంగంలో పని చేస్తూ చాలీచాలని వేతనంతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల హక్కుల పరిరక్షణ, బాలికల విద్యకు విఘాతం కలిగించే నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని, డ్రగ్స్‌ను నియంత్రించటంతోపాటు ప్రజాస్వామ్య హక్కులపై దాడులు, నిర్బంధాలను ఆపాలన్నారు. మహిళల సమస్యలను పరిష్కరించి మహిళ సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వాలు కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. పురుషులతోపాటు మహిళలకు సమాన వేతనం కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. మహిళలు నాయకత్వంలో అభివృద్ధి సాధించాలనే జీ-20 పిలుపును అమలు చేసేందుకు సమూల మార్పు అవసరమని, దీనికి రాజకీయ పార్టీలు ముందుకు రావాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షురాలుగా డి.సీతామహలక్ష్మి, కార్యదర్శిగా ఎం.జ్యోతితో పాటు 41మందితో కమిటీని నియమించారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, నాయకులు వాణి, ఇంద్రా, శ్రీలక్ష్మి, ఎస్.లక్ష్మి, గంగ, సరోజిని, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

మహిళలు వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

జీఎం(సెక్యూరిటీ) శ్రీనివాసరావు



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న జీఎం

కొత్తగూడెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని జీఎం సెక్యూరిటీ కె.శ్రీనివాసరావు తెలిపారు. సింగరేణి కార్పొరేట్ ఏరియాలోని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో కేసీఓఏ క్లబ్, ఎంపీ క్వార్టర్స్, బాబు క్యాంప్, పోస్టాఫీస్, గౌతంనగర్ ప్రాంతాల్లోని మహిళలకు ఉచిత బ్యూటీషన్, మగ్గం వర్క్, టైలరింగ్ శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల పాటు శిక్షణ ఇవ్వటం జరుగుతుందని అనంతరం నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు హైదారాబాద్ ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయం నుంచి ధ్రువీకరణ పత్రాలను అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) జి.రాజేంద్రప్రసాద్, సేవా అండ్ కమ్యూనికేషన్ అధికార టి.శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్, సేవా కార్యదర్శి సుజాత, కో-ఆర్డినేటర్లు మునీల, రమాదేవి, హిమబిందు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల పోరాట ఫలితమే

లాభాల వాటా ప్రకటన

కొత్తగూడెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు సుదీర్ఘ పోరాట ఫలితంగానే యజమాన్యం లాభాల వాటాను ప్రకటించిందని, కాంట్రాక్ట్ కార్మికులందరికీ రూ.5వేలను రాష్ట్ర ప్రభుత్వం బోనస్‌గా ప్రకటించడాన్ని సీఐటీయూ-ఎస్‌సీకేఎస్ స్వాగతిస్తుందని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దూలం శ్రీనివాస్, బి.మధులు శనివారం ఓ ప్రకటనలో అన్నారు. కార్మికులకు లాభాల వాటాను ప్రకటించడంతో ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు, సీఎండీ బలరాంకు కృతజ్ఞతలు తెలియజేశారు.



డిప్యూటీ సీఎంకు వినతి పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

సీపీసీఎల్‌లో ఉద్యోగం సాధించిన మణుగూరు వాసి

మణుగూరు, సెప్టెంబరు 21: మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని బాపనకుంట గ్రామానికి చెందిన నీరుడు సాయికిరణ్ కేంద్ర సీపీసీఎల్‌లో ఉద్యోగాన్ని సాధించాడు. మూడు నెలల క్రితం జరిగిన ఈ పరీక్షకు డిప్లమో పూర్తి చేసి సాయికిరణ్ ఎలక్ట్రికల్ గ్రూప్ విభాగానికి హాజరయ్యాడు. దేశవ్యాప్తంగా నాలుగు పోస్టులు మాత్రమే ఉండగా రెండు నెలల క్రితం టాప్ 10 పేర్లను విడుదల చేయగా.. ప్రథమ స్థానంలో సాయికిరణ్ నిలవడం విశేషం. ఇటీవల చెన్నైలో జరిగిన ఇంటర్వ్యూలో తన సత్తాను చాటి ఉద్యోగాన్ని కైవసం చేసుకున్నాడు. ఉద్యోగ నియామక పత్రాలు శుక్రవారం అందుకున్నాడు. తన తల్లి వె ంకటలక్ష్మి, మేనమామ ఏడు కొండలు సహకారంతో తాను ఈ ఉద్యోగాన్ని పొందానని సాయికిరణ్ తెలిపారు. దీంతో సాయికిరణ్ కుటుంబంతో బంధువుల్లో హర్షం వక్తమవుతోంది.





అరుణోదయ నాగన్నను కలిసిన సుద్దాల అశోక్‌తేజ

అరుణోదయ నాగన్నకు

సుద్దాల పురస్కారం

తల్లాడ, సెప్టెంబరు 21 ప్రఖ్యాత ప్రజా కవి, గాయకుడు అరుణోదయ నాగన్న.. సుద్దాల హనుమంతు-జానకమ్మ స్మారక జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. శనివారం ఖమ్మంలో అరుణోదయ నాగన్నను సుద్దాల ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ సినీ కవి సుద్దాల అశోక్‌తేజ కలుసుకొని ఈ విషయాన్ని వెల్లడించారు. 50ఏళ్లుగా అరుణోదయ సాంస్కృతిక సంస్థ తరుపున తన కలం, గళం ద్వారా సమాజ మార్పుకోసం ప్రజా చైతన్యానికి కృషి చేస్తున్నందుకు గాను నాగన్నను పురస్కారానికి ఎంపిక చేశామని ఆయన తెలిపారు. అక్టోబరు 19న హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో నాగన్నకు పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు అశోక్‌తేజ వివరించారు. పురస్కార ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హైకోర్టు జడ్జి బి.నగేష్ హాజరుకానున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో యేచన, భూపతి వెంకటేశ్వర్లు, కాకి భాస్కర్, జాన్ పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన

భద్రాచలం, సెప్టెంబరు 21 భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం ఆర్జిత సేవలో భాగంగా అంతరాలయంలో స్వర్ణ తులసార్చన నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామివారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనం వైదిక సిబ్బంది నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జమలాపురం శ్రీవారికి సర్వాంగాభిషేకం

ఎర్రుపాలెం, సెప్టెంబరు 21: మండలంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించారు. స్వామివారు ముత్యాల కవచ అలంకారంలో శనివారం దర్శనమిచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కల్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకల్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను నివేదించారు. భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని తమ నూతన వాహనాలతో గిరి ప్రదక్షిణ చేశారు. శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు స్వామివారి అన్నదాన సత్రంలో సేవా సమితి నిర్వాహకులు ఉచితంగా అన్నవితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో కె.జగన్మోహన్‌రావు, ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరిండెంట్ కె.విజయకుమారి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, సుదర్శనశర్మ, సేవాసమితి నిర్వాహకులు ఎల్‌వీ నారాయణరెడ్డి, బొబ్బాకిరణ్, వి.వెంకటకృష్ణారావు, లీలాకృష్ణ, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుతున్న భక్తులు

క్రైం సమాచారం

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

బూర్గంపాడు, సెప్టెంబరు 21: మండల పరిధిలోని బత్తుల నగర్‌లో శనివారం ప్రమాదవశాత్తూ పూరిల్లు దగ్ధమయ్యింది. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కుటుంబం ఇంటికి తాళం వేసి కూలిపనులకు వెళ్లారు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటలను ఆర్పేలోపు ఇంట్లోని సామగ్రి కాలిబూడిదైంది.



దగ్ధమయిన పూరిల్లు

సెలవు విషయంపై జగడం

- జవాన్‌పై కత్తితో దాడికి ప్రయత్నించిన ఆటో డ్రైవర్

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 21: సెలవు విషయంపై మాట మాట పెరిగి కత్తితో దాడి ప్రయత్నం వరకు వెళ్లారు ఖమ్మం నగరపాలక సంస్థలోని పారిశుధ్య విభాగంలోని ఉద్యోగులు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిదిలోని 19వ డివిజన్ స్వచ్ఛభారత్ ఆటో డ్రైవర్‌గా సతీష్ పనిచేస్తున్నాడు. శుక్రవారం తనకు సెలవు కావాలని ఆదే డివిజన్‌కు చెందిన జవాన్ నాగరాజును అనుమతి అడిగారు. ఈ క్రమంలో స్వచ్ఛతాహి సేవా 2024 కార్యక్రమం కొనసాగుతోంది. ఒక ఆటో ట్రిప్ వేసిన తర్వాత సెలవు తీసుకొమ్మని జవాన్ నాగరాజు చెప్పారు. అంతటితో ఆటో డ్రైవర్ సతీష్ ఆగకుండా సమీపంలో ఉన్న 18వ డివిజన్ జవాన్ రాంబాబు వద్దకు వెళ్లి తనకు సెలవు ఇవ్వటం లేదని వాదించాడు. ఈ క్రమంలో జవాన్ రాంబాబుకు డ్రైవర్ సతీష్‌కు వాగ్వాదం చోటు చేసుకొంది. క్షణికావేశంలో ఆటో డ్రైవర్ సతీష్ సమీపంలోనే ఉన్న మటన్ దుకాణంలోకి వెళ్లి అక్కడ ఉన్న కత్తి తీసుకొని వచ్చి జవాన్ రాంబాబుపైకి వెళ్లారు. విషయం గమనించిన పారిశుధ్య కార్మికులు సతీష్‌ను నిలువరించారు. తర్వాత రాంబాబు ఖమ్మం 1టౌన్ పోలీసు స్టేషన్‌లో హత్యాయత్నం కేసు పెట్టాలని ఫిర్యాదు చేశారు.



సతీష్‌ను ఆపుతున్న కార్మికులు

తాళ్లగూడెంలో దొంగలు హల్‌చల్

కామేపల్లి, సెప్టెంబరు 21: మరో మారు రెండు ఇళ్లలో దొంగలు హల్‌చల్ చేసిప ఘటన కామేపల్లి తాళ్లగూడెం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం తాళ్లగూడేనికి చెందిన వేముల వెంకటేశ్వర్లు ఇంట్లో తొలుత దొంగలు వచ్చి గేటు తాళాలు తీయబోయేసరికి ఇంట్లో ఉన్న కుక్క ఒక్కసారిగా అరవడంతో దొంగలు పారిపోయారు. అక్కడ నుంచి షేక్ ఫాతిమా ఇంటికి వచ్చి కిటికి తలుపులు పగలగొట్టబోయే సరికి ఇంట్లో ఉన్న వారు గట్టిగా అరవడంతో దొంగలు పారిపోయారు. రెండు, మూడు రోజుల వ్యవధిలోనే దొంగలు హడవిడి చేయడంతో గ్రామంలోని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ పని ఊళ్లో చేస్తున్నారా లేక మరేవరైన దొంగలు వస్తున్నారా తెలియాల్సి ఉంది. రాత్రిళ్లు పోలీసులు పెట్రోలింగ్ చేస్తే కొంతమేరకైన ప్రజల్లో భయం పోతుంది.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కామేపల్లి, సెప్టెంబరు 21: మద్యం తాగుతున్నాడని భార్య మందలించిందని మనస్థాపంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కామేపల్లి మండలం రామక్రిష్ణపురంలో శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రామక్రిష్ణపురం గ్రామానికి చెందిన గంట రామక్రిష్ణ(33) ఎప్పుడూ మద్యం తాగుతూ ఏం పని చేయకుండా ఇంట్లోనే ఉంటుండడంతో అతడి భార్య శ్రావణి శుక్రవారం మందలించింది. దాంతో అతడు మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. రామక్రిష్ణ భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు.

గంజాయిని అరికట్టడంలో పోలీసుల పాత్ర ప్రశంసనీయం

- భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, సెప్టెంబరు 21: గంజయిని అరికట్టడంలో పోలీసుల పాత్ర ప్రశంసనీయమని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. శనివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని పోలీసు అధికారులతో నెలవారీ సమీక్షా - సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఏర్పడిన వరదల సమయంలో, గణేష్ నిమజ్జనం సమయాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా అంకిత భావంతో ప్రజలకు సేవలందించిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలన్నారు. భవిష్యత్తులో ఎటువంటి విపత్తునైనా ఎదుర్కొనే విధంగా నమ్మకాన్ని కలిగించారని ప్రశంసించారు. కొత్త టెక్నాలజీలతో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని, ఈ క్రమంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలన్నారు. గంజయి, మట్కా, గుట్కా, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై అనునిత్యం నిఘా ఉంచాలని సూచించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గత నెలలో వర్టివల్స్ వారీగా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేసారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్, ఇల్లందు డీఎస్పీ చంద్రభాను, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

ఆలయానికి పొంచిఉన్న ప్రమాదం

బూర్గంపాడు, సెప్టెంబరు 21: మండల పరిధిలోని మోతెగడ్డ వీరభద్రస్వామి ఆలయానికి ముంపు పొంచి ఉందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పరవళ్లు తొక్కే గోదావరి మధ్యలో ద్వీపకల్పంగా ఉన్న ఆలయం ఇటీవల భారీ వరదలకు దెబ్బతింది. ఆలయ ప్రాంగణానికి కిందభాగంలో మట్టి కొట్టుకుపోవటంతో ఆలయ ప్రాంగణం బీటలు వారింది. గోదావరి నిండుగా ప్రవహిస్తుండటంతో ఇప్పటి వరకు ఈవిషయం వెలుగు చూడలేదు. ఇటీవల గోదావరి కాస్తా తగ్గుముఖం పట్టడంతో అక్కడకు వెళ్లిన స్థానికులకు ఆలయ పరిస్థితి కనిపించింది. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈఆలయంలో వీరభద్రుడు స్వయంభుగా కొలువైనాడు. ఆలయ కింది భాగం మట్టి కొట్టుకుపోవటంతో ప్రమాదం పొంచిఉందని, వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

- కొణిజర్ల పోలీస్టేషన్‌లో ఘటన

కొణిజర్ల, సెప్టెంబరు 21: విధి నిర్వహణలో ఉండగా ఓ హెడ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతిచెందాడు. కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఈసం లోకేష్(49) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం రాత్రి పోలీస్టేషన్‌లో డ్యూటీకి వచ్చిన లోకేష్ శనివారం తెల్లవారుజామున మూత్రవిసర్జనకు వెళ్లి తీవ్రగుండె నొప్పితో కిందపడిపోయాడు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మరో ఇద్దరు సిబ్బంది అతడిని గమనించి దగ్గరకు వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. ఈ విషయాన్ని ఎస్ఐకు సమాచారం ఇవ్వడంతో సీఐ సాగర్, ఎస్ఐ సూరజ్, సిబ్బంది అక్కడకు చేరుకొని పరిశీలించి లోకేష్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అన్నం ఫౌండేషన్ ఛైర్మన్ అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హెడ్‌కానిస్టేబుల్ లోకేష్ విధి నిర్వహణలోనే గుండెపోటుతో మృతి చెందినట్లు ఎస్ఐ సూరజ్ తెలిపారు. మృతుడికి భార్య సుభద్ర, కుమార్తె హరివల్లిక, కుమారుడు శ్రీవరుణ్ ఉన్నారు. లోకేష్ స్వస్థలం కొత్తగూడెంలోని గౌతమ్‌నగర్ కావడంతో తోటు సిబ్బంది సహాయంతో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అక్కడికి తరలించారు.

2000 కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన ఈసం లోకేష్ 2018లో హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. కామేపల్లిలో పని చేసి కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. కొణిజర్లలో మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు.

ప్రమాద సూచికగా.. మొక్క..!



రోడ్డుపై గుంత ముందు ఉంచిన మొక్క

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 21: ఈచిత్రాన్ని చూసి నడిరోడ్డుపై మొక్కేంటి అనుకుంటున్నారా..అవును రహదారిపై ఏర్పడిన గుంతల నుంచి ప్రమాదాలు జరగకుండా ప్రజల ప్రాణాలను రక్షించేందుకు ఏర్పాటు చేసిన మొక్క. అశ్వారావుపేటలో రాష్ట్రీయ రహదారిపై సత్తుపల్లి మార్గంలో రింగ్‌రోడ్ నుంచి పేరాయిగూడెం వరకు పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. గోతులతో ప్రజలు నిత్యం పడే బాధుల వర్ణనాతీతం. రింగ్‌రోడ్ సెంటర్ పాత ఆసుపత్రి ఎదురుగా గొయ్యి పడటంతో పక్కనే ఉన్న దుకాణదారుడు ప్రయాణికులు గోతిలో పడి ఇబ్బందులు పడకుండా ఉండేలా రక్షణగా హెచ్చరికగా ఒక మొక్కను పనికిరాని నీటి డబ్బాలో పెట్టి గుంత ముందు ఉంచారు. దీంతో వాహనదారులు గుంతను చూసుకుంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. మొక్కే అందరికీ రక్షణకవచం అవుతుందంటూ అటుగా వెళుతున్న వారు వ్యాఖ్యానిస్తున్నారు.


సహకార సంఘం మాజీ అధ్యక్షుడు

కృష్ణారెడ్డి హఠాన్మరణం

వైరా, సెప్టెంబరు 21: వైరా మండలపరిధిలోని గన్నవరం గ్రామంలో గొల్ల పూడి సహకార సంఘం మాజీ అధ్యక్షుడు, గన్నవరం గ్రామపంచాయతీ మాజీ వైస్ సెసిడెంట్ శీలం కృష్ణారెడ్డి(64)శనివారం గుడెపోటుతో హఠాన్మరణం పొందారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన భౌతికాయన్ని వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటరెడ్డి, గ్రామకాంగ్రెస్ నాయకులు శీలంరంగారెడ్డి, యన్నం వెంకట కోటిరెడ్డి సందర్శించి కాంగ్రెస్ పార్టీ జండాను కప్పి నివాళలర్పించారు. కార్యక్రమంలో శీలం చెన్నారెడ్డి,శీలం సీతారెడ్డి, శీలం శ్రీనువాస్‌రెడ్డి, వున్నాపరుపు ఏడుకొండలు, వైరా మండల కాంగ్రెస్ నాయకులు శీలం సురేందర్‌రెడ్డి, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, రాచబంటి నాగేశ్వరరావు, గుగులోత్ రాము, తేళ్లూరి వీరయ్య పాల్గొన్నారు.



పార్టీజెండా కప్పి నివాళులు అర్పిస్తున్న నాయకులు



డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక కృషి

సేవలను గుర్తించి ఎస్ఐ రాణాప్రతాప్‌కు ప్రశంస పత్రం అందజేత

జూలూరుపాడు, సెప్టెంబరు21: డ్రగ్స్ నిర్మూలనకై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించిన జూలూరుపాడు ఎస్ఐ రాణా ప్రతాప్ సేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్ఎన్ఏబీ) డైరెక్టర్ సందీప్ శాండిల్య ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆయన జారీ చేసిన ప్రశంస పత్రాన్ని శనివారం ఎస్పీ రోహిత్‌రాజు చేతుల మీదుగా ఎస్ఐ రాణా ప్రతాప్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పరితోష్ పంకజ్, భద్రాచలం ఏఎస్పీ అజిత్‌కుమార్ సంగ్వార్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న ఎస్ఐ రాణాప్రతాప్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాచలం, సెప్టెంబరు 21: ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం భద్రాచలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాలసాని లక్ష్మీనారాయణ, రత్నం రమాకాంత్, రాజీవ్, ఎండి నవాబ్, నర్రా రాము, రాజశేఖర్ పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం: సీడీపీవో

టేకులపల్లి, సెప్టెంబరు 21: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ టేకులపల్లి సీడీపీవో మంగతార అన్నారు. మండలంలోని బేతంపూడి గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం నిర్వహించిన పోషణ మాసోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ అనురాధ, పాఠశాల హెచ్ఎం వెంకట్రావు, అంగన్‌వాడీ టీచర్లు లలిత, సుగుణ, అరుణ, వెంకటనర్సమ్మ, భద్రమ్మ తదితరులున్నారు.


బేతంపూడిలో చిన్నారులకు అక్షరభ్యాసం చేస్తున్న సీడీపీవో మంగతార

'స్వచ్ఛతను పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి'

భద్రాచలం, సెప్టెంబరు 21: ప్రతి ఒక్కరు పచ్చదనం, పరిశుభ్రతను పాటిస్తే దేశం స్వచ్ఛ భారత్‌గా తయారవుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి.శ్రీనివాసరావు, హెచ్ సోమేష్, జి.బాలకృష్ణ పాల్గొన్నారు.

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల ఉన్నత పాఠశాలలో శనివారం స్వచ్ఛత హి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాన్ని తొగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం సంజీవరావు మాట్లాడుతూ స్వచ్ఛతను పాటించి ఆరోగాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సంపత్, మిర్యాలరమేష్ తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ

జూలూరుపాడు, సెప్టెంబరు 21: మండలంలోని వెంగన్నపాలెం-1 అంగన్‌వాడీ కేంద్రానికి శనివారం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన ఎర్రగోపుల సత్యనారాయణ తన కుమారుడు పార్థసారథి జ్ఞాపకార్థం చిన్నారులు కుర్చునేందుకు 16 కుర్చీలను అందించారు. దీంతో అంగన్‌వాడీ టీచర్ మణి, గ్రామస్థులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మణి, ఏఎన్ఎంలు వెంకటముత్యం, సుశీల తదితరులున్నారు.

'పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం సరికాదు'

జూలూరుపాడు, సెప్టెంబరు 21: తెలుగు విశ్వవిద్యాలయానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును తొలగించాలనే నిర్ణయం సరైనది కాదని రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నాయకుడు పెండ్యాల విజయభాస్కర్ అన్నారు. శనివారం జూలూరుపాడులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించి పొట్టి శ్రీరాములు తెలుగు వారి ఆత్మగౌరవాన్ని కాపాడారని తెలిపారు. విశ్వవిద్యాలయానికి యథావిధిగా పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని కోరారు. ప్రతి ఒక్కరూ పొట్టి శ్రీరాముల ఆశయ సాధకు కృషి చేయాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

మణుగూరు, సెప్టెంబరు21: వరదలతో నష్టపోయిన కుటుంబాలకు ఎస్‌కేటీ గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి నాగేశ్వరరావు శనివారం ఆర్థిక సాయాన్ని అందించారు. సుందరయ్య నగర్‌కు చెందిన చిరు వ్యాపారి కే. వెంకటరాజు దోసపాటి రంగారావు ఛారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. అంతేకాకుండా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చక్కా బాలకేశవులు, ఎస్‌కేటీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

దుమ్ముగూడెం సెప్టెంబరు 21: లక్ష్మీనగరం ప్రాథమిక పాఠశాల 2002-03 బ్యాచ్ విద్యార్థులు శనివారం టీచర్ శేఖర్‌బాబు జ్ఞాపకార్థం రూ.2వేల విలువగల లెర్నింగ్ మెటీరియల్, లెర్నింగ్ చార్ట్‌లతోపాటు పాఠశాలకు రంగులు వేయడానికి రూ.6వేల నగదు అందజేశారు. మద్ది ప్రవీణ్‌రెడ్డి, కిల్లంపల్లి సురేష్, గుడ్ల శివారెడ్డి, జీరి అన్వేష్‌రెడ్డి, శీరపు సంజయ్‌కాంత్ రెడ్డి, డింగి సందీప్‌రెడ్డి, గోసుల చిరంజీవి, మురళి, సుమబిందు, రాగసుధ, సత్యవాణి, శృతి, సౌమ్య, సంధ్యారాణి, పావని, శ్రీలక్ష్మి, జ్యోతి తదితరులున్నారు.

హనుమ ఆలయంలో లడ్డు పాట

దుమ్ముగూడెం సెప్టెంబరు 21: వినాయక శరన్నవ రాత్రుల సందర్భంగా దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో శనివారం లడ్డు వేలం పాట నిర్వహించారు. స్థానికులు నంబూరి సురేష్, పాలాడి సూర్యప్రభాకరావు, కొప్పూరి రమాదేవిలు కలిసి రూ15,516లకు స్వామి వారి లడ్డూప్రసాదాన్ని దక్కించుకున్నారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు ఆరుట్ల రాజగోపాలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్ రద్దు చేయాలి: సీఐటీయూ

దమ్మపేట, సెప్టెంబరు21: కార్మికులను కట్టు బానిసలుగా చేసే లేబర్ కోడ్ రద్దు చేయాలని సీఐటీయూ నాయకుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. మందలపల్లి సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాసే కోడ్‌లను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రోజు సెప్టెంబరు23 బ్లాక్‌డేగా జరిపి కార్మిక పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. కార్మిక చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 23న నిర్వహించే పోరాటాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాల నాయకులు వీరబాబు, ధర్మ, రాము, రామకృష్ణ, శ్రీను, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

మణుగూరుటౌన్, సెప్టెంబరు21: మణుగూరు పట్టణంలోని పద్మశాలి భవన్‌లో శనివారం మాజీ మంత్రి, స్వాతంత్ర సమయోధుడు దివంగత కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంక్షేమ సంఘం నాయకులు దుస్సా సమ్మయ్య, రమేష్, రుద్రనాగరాజు కోటా శ్రీనివాసరరావు, చంద్ర శేఖర్ తదితరులు కొండా లక్ష్మణ్ బాపూజీ దేశానికి చేసిన సేవలను వివరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పాటుపడిన తీరు ఎంతో మహోన్నతమైనదన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్, రవీందర్, వీరంకి వెంకట్రావ్ గౌడ్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తిర్లాపురంలో వైద్య శిబిరం

మణుగూరుటౌన్, సెప్టెంబరు21: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని తిర్లాపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రాజెక్టు అధికారి ఎంఎంజీవోసీ శ్రీనివాసచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి పరిసర గ్రామాల్లో ఇలాంటి వైద్య శిబిరాలను సింగరేణి సామాజిక బాధ్యతలో భాగంగా నిర్వహిస్తుందన్నారు. నిర్వహించిన వైద్య శిబిరంలో 211 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్ర మంలో వైద్యులు శేషగిరిరావు, మణుగూరు ఓసీ సేఫ్టీ అధికారి భాస్కర్ రావు, డివైపీఎం అవినాష్, ఏరియా వైద్యులు అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: పర్ణశాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం గోవిందాపురంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటింటి సర్వే, యాంటి లార్వా ఆపరేషన్, సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించారు. జ్వరపీడితులకు రక్త పరీక్షలు నిర్వహించి వైద్యం అందించారు. చిన్నపిల్లల వ్యాక్సిన్ కార్యక్రమాన్ని వైద్యాధికారి రేణుకారెడ్డి తనిఖీ చేశారు. హెచ్‌వీ అమ్మాజీ, హెచ్ఏ నాగేశ్వరావు, ఏఎన్ఎం సావిత్రి, నరసమ్మ తదితరులున్నారు.

రోడ్లు బాగు చేయండి

● రామానుజవరం గ్రామస్థుల వినతి

మణుగూరు రూరల్, సెప్టెంబరు21: మండలంలోని రామానుజవరం గ్రామంలో శివాలయంలో చెక్‌పోస్టు కాలనీ రోడ్లను బాగు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాలువలు పూడిపోయి చెత్తా చెదారం పెరిగి రోడ్లను మూసివేస్తున్నాయని వాపోయారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. పంచాయతీ అధికారులు సిబ్బంది సమస్యలపై స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు టి ప్రభుదాస్, అక్కి నర్సింహారావు, కృష్ణ, బండారి సతీష్, జంపయ్య వెంకన్న, సిద్ధు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రామానుజవరం మాజీ సర్పంచ్‌కు పితృవియోగం

మణుగూరు రూరల్, సెప్టెంబరు21: మండలంలోని రామానుజవరం పంచాయతీ మాజీ సర్పంచ్ బాడిస సతీష్ తండ్రి రాములు(65) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు అయోధ్య, జంగం మోహన్ రావు, సుధాకర్, కామిశెట్టిరామారావు, కొత్తపల్లి సీతారాములు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా దంత వైద్యశాల

» ప్రజలకు అందని దంతవైద్య సేవలు » ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యుని పోస్టు » వినియోగంలోకి తేవాలని వినతి

జూలూరుపాడు, సెప్టెంబరు 21: ప్రజలకు దంత వైద్య సేవలను అందించాలని సంకల్పించి జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రిలో గత కొన్నేళ్ల క్రితం డెంటల్ యూనిట్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సేవలను అందించేందుకు దంత వైద్యాధికారిని నియమించారు. కాగా రెండు నెలల క్రితం బదిలీల్లో భాగంగా ఆసుపత్రిలో దంత వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న పోటు వినోద్ హైదారాబాద్‌లోని మల్కాజిగిరి ఆసుపత్రికి వెళ్ళారు. ఆయన స్థానంలో భద్రాద్రి జిల్లాలోని బూర్గంపాడు ఆసుపత్రిలో దంత వైద్యురాలిగా పనిచేస్తున్న అనిత బదిలీపై జూలూరుపాడు ఆసుపత్రికి వచ్చారు. కాగా ఆమె కొన్ని రోజులు మాత్రమే విధులకు హాజరై మెడికల్ లీవ్ పెట్టారు. అనంతరం డిప్యూటేషన్‌పై తిరిగి సదరు వైద్యురాలు బూర్గంపాడు ప్రభుత్వాసుపత్రికి వెళ్లిపోయారు. దీంతో జూలూరుపాడు ఆసుపత్రిలో దంత వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉంది. వైద్యుడు లేకపోవడంతో ప్రజలకు దంత వైద్య సేవలందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వివిధ గ్రామాల నుంచి సేవలను పొందేందుకు పలువురు రోగులు ఆసుపత్రికి వస్తున్నారు. దంత వైద్యుడు లేరని సిబ్బంది చెప్పటంతో వారు నిరాశ చెందుతున్నారు. దంతవైద్య సేవలకై కొత్తగూడెం, ఖమ్మం ప్రాంతాల్లోని ప్రవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. గత కొన్నేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ రజత్ కుమార్‌శైని ప్రజలకు మెరుగైన దంత వైద్యసేవలను అందించేందుకు గాను జూలూరుపాడు డెంటల్ యూనిట్‌కు రూ. 10లక్షల విలువ చేసే డెంటల్ చైర్, పరికరాలను అందించారు. అయినప్పటికి ఈ దంత వైద్యశాలలో ప్రజలకు సేవలు అందించటానికి వైద్యాధికారి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురికావల్సి వస్తుంది. ఇప్పటికైన దంతవైద్యాధికారిని తక్షణమే నియమించి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వ వైద్యాధికారి బి. వెంకటేశ్వర్లను వివరణ కోరగా ఇక్కడ పనిచేస్తున్న దంత వైద్యురాలు డిప్యూటేషన్‌పై వెళ్లిందని, ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.


జూలూరుపాడులోని ఆసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న పరికరాలు

విస్తరణ పనులను త్వరలో పూర్తి చేస్తాం

● ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట, సెప్టెంబరు21: అశ్వారావుపేట పట్టణంలో చాలా కాలంగా నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులను ఈ ఏడాది చివరినాటికల్లా పూర్తి చేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఊట్లపల్లి రోడ్డులో జరుగుతున్న రహదారి మరమ్మతు పనులను పరిశీలించారు. ముందస్తు ప్రణాళికతో ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా విస్తరణ పనులు, సెంట్రల్ లైటింగ్ పనులను త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఆయన వెంట అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


అశ్వారావుపేటలో రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ప్రకృతి ఆధార పంటలతో మానవాళికి మేలు

రసాయనిక ఎరువులు వేయకుండా పూర్తిగా ప్రకృతి ఆధారంగా పండించిన పంటలు మానవాళికి ఎంతో మేలు చేస్తుందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శనివారం మండల పరిధిలోని మల్లాయిగూడెం, దిబ్బగూడెం, పండువారిగూడెం, రామన్నగూడెం గ్రామాలలో నాబార్డు ఆధ్వర్యంలో రైతులు సాగు చేస్తున్న ప్రకృతి ఆధారిత పంటలను ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. ప్రకృతి ఆధారంగా వ్యవసాయ రంగంలో అధిక దిగుబడులు సాధించటానికి 14 రకాల జీవ సాయనాలను ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతను నాబార్డు ప్రతినిధులు రైతులకు వివరించారు. అక్కడే నెలకొలిపిన జీవ వనరుల కేంద్రం అభివృద్ధి కేంద్రాన్ని రైతులకు చూపించారు. కార్యక్రమంలో నాబార్డ్ డీఎం సంపత్‌కుమార్, ఏఓ శివకృష్ణ, ఏఈఓ షాకీరాబాను, కార్యదర్శి శ్రీకాత్, కాంగ్రెస్ నాయకులు జూపల్లి ప్రమోద్, మొగల్లపు చన్నకేశవులు, తుమ్మా రాంబాబు, సతీష్, కొర్రి మల్లయ్య, , దారా ప్రసాదరావు తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పినపాక, సెప్టెంబరు21: గ్రామాల అభివృద్ధే కాం గ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని భూపాల పట్నం గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆయనకు భూపాలపట్నం గ్రామపంచాయతీతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గతంలో ఏడూళ్లబయ్యారం గ్రామపంచాయతీలో కలిసి ఉన్న క్రమంలో తమ గ్రామానికి తగినంత ప్రాధాన్యత దక్కడం లేదని, తమను ప్రత్యేక పంచాయతీగా గుర్తించి ఏర్పాటు చేయాలని, ఆనాటి ఎమ్మెల్యేగా ఉన్న పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకుపోవడంతో, వెంటనే జిల్లా కలెక్టర్, డీఎల్‌పీవోలతో మాట్లాడి నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో వెంకటేశ్వరరావు, ఆర్ఐలు బాలకృష్ణ, రమేష్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గొడిశాల రామనాథం, మాజీ సర్పంచ్ కొర్సా కృష్ణంరాజు, ఉప సర్పంచ్ నిట్టా వెంకటేశ్వర్లు, వైద్యాధికారి దుర్గాభవాని, గంగిరెడ్డి వెంకటరెడ్డి, పేరం వెంకటేశ్వరరావు, లక్ష్మీరెడ్డి, శ్రీనివాసరెడ్డి, తోలెం కళ్యాణి, ఈసం భవతి, కృష్ణ, రాజేష్, లింగయ్య, నళిన్, బండారు సాంబ, నవ్వాతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: మండల పరిధిలోని బూర్గంపాడులో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అదేవిధంగా ఐకేపీ కార్యాలయంలో మహిళాశక్తి పథకం ద్వారా ఏర్పాటు చేసిన టైలరింగ్ హబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపీవో సునీల్‌కుమార్, ఐటీసీ అడ్మిన్‌అధికారి చెంగల్రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సతీష్ తదితరులున్నారు.


బూర్గంపాడులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

అశ్వాపురం సెప్టెంబరు 21: మండల పరిధిలోని మొండికుంట, మల్లెలమడుగు గ్రామాల్లో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం పరామర్శించారు. మొండికుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొండాబత్తుల ఉపేందర్‌ను పరామర్శించారు. అదే విధంగా మల్లెలమడుగు గ్రామానికి చెందిన టీజేఏస్ నాయకుడు పిప్పళ్ల శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందగా, అతని కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నెల్లిపాక సింగిల్ విండో చైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మొండికుంట మాజీ ఎంపీటీసీ కమటం నరేష్, మండల కాంగ్రెస్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, రాగం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్లగూడెంలో జోనల్‌స్థాయి క్రీడాపోటీలు

దుమ్ముగూడెం సెప్టెంబరు 21:అండర్-14, అండర్-17 బాల బాలికలకు ఆర్లగూడెం ఆశ్రమపాఠశాలలో ఈనెల 23, 24 తేదీల్లో జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో సమ్మయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండల స్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, షాట్‌పుట్, మొదలైన క్రీడల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మంత్రి పొంగులేటి పర్యటనను విజయవంతం చేయాలి

» మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు

ఇల్లెందు, సెప్టెంబరు 21: ఇల్లెందు పట్టణం, మండలంలో సోమవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించనున్నారని మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆహ్వానం మేరకు నియోజకవర్గంలో పర్యటిస్తున్న మంత్రి పొంగులేటి పట్టణంలో పలు రకాల కార్యక్రమాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని వెల్లండించారు. కాంగ్రెస్ శ్రేణులు, పార్టీ అనుబంధ సంఘాల నేతలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని చైర్మన్‌తో పాటు పట్టణ, మండల అధ్యక్షుడు దొడ్డా డానియల్, పులి సైదులు కోరారు.

మంత్రి పొంగులేటి ప్రారంభించనున్న పనుల వివరాలు

మంత్రి ప్రారంభించనున్న పనుల వివరాలను మునిసిపల్ చైర్మన్ వెల్లడించారు. లేక్ వ్యూపార్క్‌లో రూ. కోటి వ్యయంతో నిర్మించిన స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభిస్తారని, బుగ్గవాగు ప్రక్షాళనలో రిటైనింగ్‌వాల్ నిర్మాణం పనులు, రూ13.60కోట్ల వ్యయంతో నిర్మిచనున్న ఆడిటోరియం పనులకు, వివిధ కూడళ్లలో ఫౌంటేన్ల నిర్మాణం పనులు, షాపింగ్ కాంప్లెక్స్, మోడల్ మార్కెట్, ఆర్అండ్ఆర్ కాలనీలో పార్క్ పనులు, ముకుందాపురం కట్టుగూడెం నడుమ రూ.5కోట్ల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు పనులు, మేడికుంట, రామచంద్రుని పేట నడుమ రూ.80లక్షలతో నిర్మాణం పనులు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. అదేవిధంగా మండలంలోని బొజ్జాయిగూడెం సమ్మక్క సారలమ్మ గద్దెల సమీపంలోని ఫంక్షన్‌హాల్‌లో ఇల్లెందు నియోజకవర్గం అధికారులతో సమీక్ష సమావేశం జరుగుతందని తెలిపారు. మంత్రి పొంగులేటి పర్యటనలో అధిక సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు పాల్గొనాలని దమ్మాలపాటి కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి, భోళ్ళ సూర్యం, ఎండీ జాఫర్, సుదర్శన్‌కోరి, ఆరేం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు

దళారులను నమ్మవద్దు

● తహసీల్దార్ రాఘవరెడ్డి

మణుగూరు, సెప్టెంబరు21: మండలంలో వరదల వల్ల ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించేందుకు ఏర్పాటు చేసిన సైట్ క్లోజ్ అయిందని తహసీల్దార్ రాఘవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు దళారులు దరఖాస్తులను వరద బాధితుల పేరుతో కార్యాలయం వద్దకు వస్తూ కార్యాలయ సిబ్బందిని, అధికారులను ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. ప్రజలు ఎవ్వరూ కూడా దళారుల మాటలు విని మోసపోవద్దని తెలిపారు.

భద్రాద్రి జిల్లాలో వర్షం


కొత్తగూడెంలో కురిసిన వర్షానికి రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

చుంచుపల్లి, సెప్టెంబరు21: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శనివారం రాత్రి ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంతో పాటు, చుంచుపల్లి, జూలూరుపాడు, ములకలపల్లి, పినపాక, ఇల్లందు, అశ్వారావుపేట తదితర ప్రాంతాలలో చల్లటి ఈదురు గాలి వీచి ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మహిళలు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రవేటు ఆసుపత్రిలలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగులు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లపై వర్షపు నీరు నిల్వడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రాజీలేని పోరాటాలు చేస్తాం

● ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి.సీతాలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న సీతాలక్ష్మి

భద్రాచలం, సెప్టెంబరు 21: దేశంలో, రాష్ట్రంలో మహిళలపై రోజు రోజుకు పెరుగుతున్న హింసకు వ్యతిరేకంగా మహిళల సమస్యలపై పోరాటాలు చేస్తామని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సీతాలక్ష్మి అన్నారు. శనివారం భద్రాచలంలో జరిగిన ఆమె మాట్లాడుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం భద్రాద్రి జిల్లా మూడో మహాసభలు ముగిసాయని తెలిపారు. మహిళ సమస్యలను ఎత్తి చూపుతూ పోరాటాలను నిలదీస్తూ సాగిన ర్యాలీకి సైతం పట్టణంలో ప్రముఖులు సంఘీభావం తెలిపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుడి నిమజ్జనోత్సవం

కొత్తగూడెం సాంస్కృతికం, సెప్టెంబరు 21: కొత్తగూడెం కూలీలైన్ ఏరియాలోని 25 అడుగుల గణపతి విగ్రహానికి శనివారం వైభవంగా శోభాయాత్రనిర్వహించారు. ప్రత్యేక రథంపై భద్రాచలంలోని గోదావరిలోని నిమజ్జనం చేసేందుకు భక్తజనం తరలివెళ్లారు.


నిమజ్జనోత్సవం నిర్వహిస్తున్న యువకులు

రుణాల మంజూరు, రికవరీలో లక్ష్యాన్ని చేరుకుంటాం

● ఆర్ఎం శ్రీనివాస్

చంద్రుగొండ, సెప్టెంబరు21: శ్రీనిధి రుణాలు మంజూరు, రికవరీలో లక్ష్యాన్ని చేరుకుంటామని, ఆమేరకు మండల, గ్రామ స్థాయిలో సిబ్బంది కృషి చేస్తున్నారని శ్రీనిధి రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆర్ఎం విలేకరులతో మాట్లాడుతూ భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో డ్వాక్రా సంఘాలకు రూ. 94 కోట్లు శ్రీనిధి రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకునామని, ఇప్పటివరు 1,639 సంఘాలకు రూ. 15 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. 50 శాతం రుణాలు చెల్లింపులు జరిగాయన్నారు. లక్ష్యాన్ని చేరుకునేందుకు తమ సిబ్బందిని సిద్ధం చేస్తున్నామని ఆర్ఎం తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఎం సంతోష్ పాల్గొన్నారు.


కంప్యూటర్‌ను పరిశీలిస్తున్న ఆర్ఎం శ్రీనివాస్

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ ప్రకటనపై హర్షం


కొత్తగూడెంలో మిఠాయిలు పంచిపెడుతున్న ఏఐటీయూసీ నాయకులు

కొత్తగూడెం, సెప్టెంబరు 21 : సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో బోనస్ ప్రకటనపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం కార్మికులు మిఠాయిలు పంచుకుని తోటి కార్మికులతో తమ సంతోషాన్ని పంచుకున్నారు. సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు గత సంవత్సరం వచ్చిన లాభాల నుంచి పర్మినెంట్ కార్మికులకు 33శాతం బోనస్‌తో పాటు కాంట్రాక్ట్ కార్మికులకు ఒక్కొక్కరికీ రూ.5వేలు చెల్లించడానికి ప్రభుత్వం, యాజమాన్యం నిర్ణయించడంతో కార్మికులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. యాజమాన్యం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రత్యేక చొరవతోనే బోనస్ ప్రకటన సాధ్యమైందని ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రంగాని కృష్ణయ్య వైస్ ప్రెసిడెంట్ క్రిస్టాఫర్‌లు కార్మికులతో కలసి వివిధ పని ప్రదేశాల్లో సంబురాలు జరుపుకుని లాభాల వాటా నుంచి కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ చెల్లింపు నిర్ణయంపై కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రమేష్, నరసింహ, వినోద, లక్ష్మి, శంకర్, అనసూయ, గణేష్, విక్రం, పాషా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశంతో నిలిచిన డ్రైనేజీ నిర్మాణ పనులు

చంద్రుగొండ, సెప్టెంబరు 21: చంద్రుగొండలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులు హైకోర్టు జోక్యంతో శనివారం నిలిచిపోయాయి. చంద్రుగొండ ప్రధాన సెంటర్ నుంచి జూలూరుపాడు, బెండాలపాడు వైపు వెళ్లే రోడ్లకు ఇరువైపుల 1,800ల మీటర్ల మేర డ్రైన్ నిర్మాణం కోసం గత ప్రభుత్వంలో రూ3.12 కోట్లు మంజూరయ్యాయి. ఈ సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభం కాలేదు. ఇటీవల పనులు ప్రారంభించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు కొలతలు తీస్తున్న సమయంలో నిర్మాణాలు కోల్పోతున్న వారు తీవ్రంగా అడ్డుకున్నారు. అయినా అధికారులు డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టారు. దీంతో ఇళ్ల యజమానులు కొందరు హైకోర్టును ఆశ్రయించి శుక్రవారం రాత్రి పనులు నిలుపుదల ఉత్తర్వులు పొందారు. కోర్టు ఆదేశాలతో తాత్కలికంగా పనులు నిలిపివేశామని ఏఈ లక్ష్మానాయక్ తెలిపారు.

వాహనాల తనిఖీలు

మణుగూరు, సెప్టెంబరు21: మావోలు ఇచ్చిన వారోత్సవాల పిలుపు సందర్భంగా మణుగూరు డివిజన్‌లో పోలీసులు వాహన తనిఖీలు శనివారం ముమ్మరంగా నిర్వహించారు. మణుగూరు పట్టణంలోని ప్రధాన రహదారిపై మణుగూరు గుండా భద్రాచలం, పినపాక వైపునకు వెళ్లే ప్రతి వాహనాన్ని నిశితంగా పరిశీలిస్తూ ప్రయాణికులు వివరాలను తెలుసుకున్నారు. ప్రయాణికుల బ్యాగులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.